Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 29.11.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 26 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com






- వరుసబెట్టి పథకాలు అమలులోకి తెస్తున్న జగన్‌రెడ్డి
- స్థానిక ఎన్నికలలోపే ప్రజల ముందుకు ఫలితాలను తెచ్చే ప్రయత్నం
- కేంద్రం తనపై కత్తికడుతుందనే ఉద్దేశ్యంతో దూకుడు పెంచిన సీఎం
- ఉచిత పథకాలు ఎక్కువైతే ఆర్థిక ఉత్పాతం తప్పదంటున్న మేధావి వర్గం

# నవరత్నాలే తన లక్ష్యాలు

**కూ**ర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయని పెద్దల మాట. కష్టపడితే కండ కరిగినా సంపద పెరుగుతుంది. సంపద పెరిగేకొద్దీ దానికి తగ్గట్లు ఖర్చు చేసుకుంటున్నా ఎటువంటి ఇబ్బందీ వుండదు. కాని, సంపద పెరగకుండా ఖర్చు పెంచుకుంటూ పోతుంటే కొన్నాళ్లకు ఆస్తులే కర్పూరంలా కరిగిపోతాయి. తర్వాత తినడానికి, తిండికి అమ్మడానికి ఏమీ మిగలదు.

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు వుండాల్సిందే... కాని, ఎంత వరకు... దారిద్ర్య రేఖకు ఇంకా దిగువ వుండి కూడు, గుడ్డ, వసతి లేనివారి కోసం, వారి చదువులు, వైద్యం కోసం, నిరాశ్రయులైన వృద్ధులు, వితంతువులు, ఏ పనీ చేసుకోలేని దివ్యాంగుల కోసం, కష్టాలు, నష్టాలు భరిస్తూ కూడా ఈ దేశ ప్రజలకు తిండి గింజలు పండిస్తున్న రైతుల కోసం, అనాది నుండి అన్ని విధాలుగా వెనుకబడ్డ అణగారిన వర్గాల కోసం కొంతవరకు సంక్షేమ పథకాలుండాలి. అంతేగాని పరిపాలన, ప్రభుత్వాల పని తీరు అంతా కూడా సంక్షేమ పథకాల చుట్టే కేంద్రీకృతం కాకూడదు.

> ‘ఆహారం నోటికందిస్తే సింహం కూడా వేటాడడం మరచిపోతుంది. మనిషి కూడా అంతే... సంక్షేమ పథకాల పేరుతో అన్నీ ఉచితంగా ఇస్తే ప్రభుత్వంపై భారం పెరిగి ఉత్పత్తి తగ్గిపోతుంది. సంక్షేమ పథకాలను ఎక్కువగా అమలు చేసిన వెనిజులా దేశం ఇప్పుడు ఏ విధంగా తయారయ్యిందో ఇటీవలకాలంలో ఉదాహరణగా చూపిస్తున్నారు.’

సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్‌లోని వైసిపి ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాల రికార్డులను బద్ధలు కొడుతోంది. కేవలం ఆరంటే ఆరు నెలల్లో ఇన్ని సంక్షేమ పథకాలను అమలులోకి తెచ్చిన ప్రభుత్వం ఏదీ లేదు. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చాను కాబట్టి తన మాటను ఆచరణ రూపంలోకి తేవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వరుసబెట్టి వరాలు కురిపించేస్తున్నాడు. అయితే ఈ పథకాలన్నీ కూడా ఒక నెలకో, ఒక సంవత్సరానికో పరిమితం కాదు, ఏ ప్రభుత్వం వచ్చినా ఇక కొనసాగించాల్సిందే! ఎందుకంటే ఒక పథకాన్ని ప్రజలకు అలవాటు చేసి పెట్టారంటే, ఇక ఆ పథకాన్ని ఏ కొత్త ప్రభుత్వం వచ్చినా తీయలేకపోతోంది. దీనికి ఉదాహరణ కిలో బియ్యం 2రూపాయల పథకమే! 1983లో స్వర్గీయ నందమూరి తారకరామారావు 2 రూపాయల కిలో బియ్యం పథకం తెచ్చారు. అప్పుడు మార్కెట్‌లో నాణ్యమైన బియ్యం కిలో అయిదారు రూపాయలే! ఈ పథకాన్ని తెచ్చి 35ఏళ్లు దాటింది. బయట మార్కెట్‌లో కిలో బియ్యం 50 నుండి 60 రూపాయలుగా వుంది. కాని, కిలో 2రూపాయల బియ్యం పథకం అలాగే కొనసాగుతోంది. ఇదన్నా సక్రమంగా అమలవుతుందా అంటే అదీ లేదు. (మిగతా 11వ పేజీలో)




## శాసనసభా సమావేశాలలోపే

# ‘దేశం’ ఖాళీ అవుతుందా?

- చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదా గల్లంతు కావడం ఖాయం
- త్వరలో రాష్ట్రంలో భారీ రాజకీయ పరిణామాలు
- వైసిపిలోకి టిడిపి నుండి పెద్దఎత్తున చేరికలు



“నువ్వు నేర్పిన విద్యయే నీరజాక్ష’.. అన్నట్లయ్యింది తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు పరిస్థితి. రాజకీయాలలో జంపింగ్‌లను ప్రోత్సహించిన వారిలో మొదటి ర్యాంకు ఆయనది. ఒకప్పుడు కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి ఆయన జంప్ చేశాడు. ఆ తర్వాతకాలంలో ఎందరినో జంప్ చేయించాడు. అంతెందుకు తాను ముఖ్యమంత్రిగా వున్న గత 5ఏళ్లలో వైసిపిలో వున్న ముగ్గురు ఎంపీలు, 23మంది ఎమ్మెల్యేలను తన పార్టీలోకి జంప్ చేయించాడు. వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టాడు.

ప్రతిపక్షంలో వున్నా కూడా అవసరాల కోసం అధికారపార్టీలోకి మారడం తప్పుకాదనే ఒక సంకేతాన్ని ఆయన ప్రజాప్రతినిధులకు అందించాడు. ఇప్పుడు ఆ సంకేతాలనే ఆయన పార్టీలో వున్న ఎమ్మెల్యేలు కూడా అనుసరించబోతున్నారని తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయాలలో భారీమార్పులు (మిగతా 11వ పేజీలో)

## వైభవంగా కసుమూరు దర్గా గంధ మహోత్సవం



నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని కసుమూరులో హజరత్ సయ్యద్ కరిముల్లాషా ఖాద్రి ఉరఫ్ కాలేషా ఫీర్ మస్తాన్ వలీ 242వ గంధ మహోత్సవాలు ఈనెల 23 న వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ముజావర్లు, ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. సమాధిపై సుగంధ ద్రవ్యాలను చల్లి దర్గా ప్రాంగణాన్ని పూలతో, విద్యుద్దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. చందన్ మహల్ నుంచి గుర్రంపై భక్తజన సందోహంతో ఉత్సవంగా గంధం ఈనెల 24న ఉదయం దర్గాకు చేరింది. కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్ దర్గాపై సుగంధ ద్రవ్యాలు చల్లి, సమాధికి గంధం పూసి భక్తులకు అందజేశారు. గంధ మహోత్సవం సందర్భంగా దేశం నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి మస్తాన్ వలీని దర్శించుకున్నారు. ఈనెల 25న గంధ మహోత్సవం ముగిసింది. గంధ మహోత్సవంలో ప్రముఖులు, సెలబ్రిటీలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


# ఆటోలపై పోలీసుల పంజా



సింహపురి సమాచారం

పాఠశాల ఆటోలపై పోలీసులు పంజా విసిరారు. ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుని వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఆరుగురినే ఎక్కించుకోవాల్సి వుండగా 15 నుంచి 20 మందిని ఎక్కించుకుని వెళ్తున్నారు. దీనికి తోడు మితిమీరిన వేగంతో పోవడంతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం వుంది. జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆదేశాల మేరకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నారు.

నెల్లూరు జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో డీఎస్పీల నేతృత్వంలో సిబ్బంది పాఠశాలల ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పాఠశాలలకు విద్యార్థులను తరలించే ఆటోల వివరాలను పోలీసు అధికారులు సేకరిస్తున్నారు. ముఖ్యంగా 12 ఏళ్ల లోపు పిల్లలైతే ఆరుగురిని మించి తీసుకెళ్లకూడదు. పిల్లలను డ్రైవర్ల ప్రక్క సీట్లలో కూర్చోబెట్టకూడదు. ఆటోలకు రెండు వైపులా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ఇష్ట ప్రకారం బ్యాగులు తగిలించరాదు. విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు విధిగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన నెంబరును కలిగి వుండాలి. నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం ప్రతి ఆటోను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటించని ఆటోలపై కేసులు నమోదు చేస్తున్నారు. విద్యార్థులను పాఠశాలకు తీసుకు వస్తున్న ఆటోల వివరాలను ఆయా పాఠశాల యాజమాన్యాలు విధిగా తెలుసుకుని వుండాలి. డ్రైవరుకు సంబంధించిన పూర్తి వివరాలను యాజమాన్యం వద్ద వుండాలి. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు పాఠశాల యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి వస్తోందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రతి పాఠశాల మెయిన్ గేటు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.




### సీసీ కెమెరాలతో...

## నేరాలకు చెక్

**- నగర డిఎస్పీ శ్రీనివాసులు**

నెల్లూరు నగరంలో సీసీ కెమెరాలను విస్తరించి నేరాలకు చెక్ పెట్టేందుకు ముమ్మరకృషి చేస్తున్నామని నెల్లూరు నగర డిఎస్పీ జె.శ్రీనివాసులు తెలిపారు. గ్రీన్ హోమ్స్ సహకారంతో నెల్లూరు వేదాయపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాయపాలెం, షిర్డీసాయి నగర్, రెవెన్యూ కాలనీలో ఈనెల 24న 12 సిసి కెమెరాలను ఏర్పాటుచేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు నగరం రానురాను బాగా విస్తరిస్తోందని, పలుప్రాంతాల్లో నివాస సముదాయాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో నేరాలు జరుగకుండా అడ్డుకునేందుకు సీసీ కెమెరాల నిఘా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కమ్యూనికేషన్స్ ఎస్ఐ డి.సురేంద్రబాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి చొరవతో నగరం పరిధిలో 180 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ టివి సుబ్బారావు, ఎస్ఐలు లక్ష్మణ్, పుల్లారెడ్డి, తహశీల్దారు జి.రాఘవేంద్రరావు, సొసైటీ ప్రతినిధులు పూండ్ల మురళీధర్‌రెడ్డి, గునుపాటి వంశీకృష్ణ, మద్దిశెట్టి సురేష్, కె.చిరంజీవిరెడ్డి, కె.శాంతి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార కమిషనర్
# ఎంపిక కమిటీలో అనిల్



రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఎంపిక కమిటీలో నెల్లూరునగర ఎమ్మెల్యే, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు చోటు దక్కింది. ఈమేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ప్రతిపక్ష నేత, అలాగే కేబినెట్ మంత్రి ఒకరు, పలువురు ప్రిన్సిపల్ సెక్రటరీలు సభ్యులుగా వుంటారు. వీరు ఎంపిక చేసిన వ్యక్తినే సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియ మిస్తారు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు అప్పటి ఆర్థికశాఖ మంత్రి కె.రోశయ్యకు, ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య మంత్రిగా వున్నప్పుడు అప్పటి ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఈ అవకాశం లభిస్తే, ఇప్పుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఇరిగేషన్ మంత్రిగా వున్న అనిల్‌కు ఈ అవకాశం దక్కడం విశేషం!

అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఛైర్మన్‌గా కొనసాగే నవరత్నాల అమలు కమిటీలో సైతం మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సభ్యుడయ్యాడు. ముఖ్యమంత్రి జగన్ జిల్లా మంత్రి అనిల్‌కి ఎంతటి ప్రాధాన్యతనిస్తున్నాడో వీటిని బట్టి అర్థమవుతుంది.

# ఏసిబికి చిక్కిన విఆర్ఓ

టిపిగూడూరు మండలం వరిగొండ బిట్-1 విఆర్ఓ ఉషాలావణ్య పూర్ణిమ లంచం తీసుకుంటూ 27వ తేదీ ఏసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికింది.

నెల్లూరు నగరానికి చెందిన లోకేష్ అనే వ్యక్తికి వరిగొండ పరిధిలో వున్న 9సెంట్ల భూమికి పాస్‌బుక్ ఇచ్చేందుకు 3వేల రూపాయలు లంచం ఇస్తుండగా ఏసిబి అధికారులు మాటువేసి పట్టు కున్నారు. ఈ పాసుబుక్ కోసం లావణ్య పూర్ణిమ 6వేల లంచం డిమాండ్ చేసింది. లోకేష్ ఈ విషయాన్ని ముందుగానే ఏసిబి అధికారులకు చెప్పాడు. వారి సూచనల మేరకే 27వ తేదీ వరిగొండ పంచాయితీ కార్యాలయంలో ఆమెకు లంచం ఇస్తుండగా ఏసిబి అధికారులు వాళ్ళ పని వాళ్ళు చేశారు.

# ప్రతిపాదించండి - పరిష్కరిస్తాం

### - యం.పి కి పి.యం హామీ



**మోడీని కలిసిన శీనయ్య**

**ఒంగోలు యంపి మాగుంట శీనయ్య 27వతేదీ బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ప్రకాశం జిల్లాలో వున్న అనేక సమస్యలను ప్రధాని దృష్టికి తెచ్చారు. శీనయ్య చెప్పిన అనేక విషయాలు ఓపిగ్గా విన్న ప్రధాని మీ సమస్యలను, ప్రతిపాదనలను లిఖితపూర్వకంగా ఇవ్వండి అన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చాడు.**

# మంత్రుల భాష దారుణంగా వుంది

### - ఆనం వెంకటరమణారెడ్డి



రాష్ట్ర మంత్రులు సీఎం మెప్పు కోసం మాట్లాడే భాష దారుణంగా వుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఈనెల 27న నెల్లూరు లోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మంత్రులు డ్రామా కంపెనీల్లా తయారయ్యారన్నారు. మంత్రి బొత్స నాడు వైయస్సార్‌ని, వైయస్ విజయమ్మను తిట్టారని, ఇప్పుడు వారి కుమారుని కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారని, బొత్స అవసరాల కోసం ఏమైనా చేస్తారనడానికి ఇదే నిదర్శన మన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు అనేక సమావేశాలను అమరావతిలో నిర్వహించారని, అంటే అవన్నీ శ్మశానంలో జరిగాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అవమానిస్తున్నది రాజధానిని కాదని రాష్ట్ర ప్రజలనన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యలు చాలా దారుణంగా వున్నాయన్నారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# పూలేకు నివాళులు



మహాత్మా జ్యోతిరావు పూలే 129వ వర్థంతి సందర్భంగా నెల్లూరు విజయమహల్ గేటు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు, వివిధ బిసి సంఘ నాయకులు ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు.

# వైసిపిలోకి జలీల్?



మాజీమేయర్, ప్రస్తుత నెల్లూరురూరల్ టిడిపి ఇన్‌ఛార్జ్ అబ్దుల్ అజీజ్ సోదరుడు, మాజీ కార్పొరేటర్ జలీల్ టిడిపిని వీడి వైసిపిలో చేరనున్నట్లు తెలుస్తోంది. జలీల్ అంతకు ముందు వైసిపిలోనే వున్నాడు. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో వైసిపి నుండి కార్పొరేటర్‌గా గెలిచాడు. ఆ తర్వాత తన అన్న అజీజ్‌తో పాటు తెలుగుదేశంలో చేరాడు. మేయర్‌గా అజీజ్ వున్నంత కాలం షాడోమేయర్‌గా వ్యవహరించాడు. నిన్నటి ఎన్నికలలోనూ నెల్లూరురూరల్ టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన తన అన్న అజీజ్ కోసం పని చేశాడు. ఇప్పుడు అజీజేమో నెల్లూరురూరల్ టిడిపి ఇన్‌ఛార్జ్‌గానే వున్నాడు. తమ్ముడు జలీల్ మాత్రం వైసిపిలోకి వస్తున్నాడు.

### • చెన్నై టి-నగర్

# 7 కొండలవాడి సేవకోసం.. 7 మంది నెల్లూరీయులు

మద్రాసు టి-నగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నడిచే శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన స్థానిక సలహా మండలి (ఎల్ ఏ సి)ని 32 మందితో ఇటీవల నియమించారు.

కొత్తగా ఏర్పడిన ఈ కమిటీలో ఇద్దరు ఉపాధ్యక్షులతో సహా ఏడు మంది నెల్లూరీ యులు వుండడం విశేషం. నెల్లూరుకు చెందిన కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి ఆనందకుమార్‌రెడ్డిలు ఉపా ధ్యక్షులుగా ఉండగా, శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కృష్ణా బిల్డర్స్ అధినేత ఇ.కృష్ణారెడ్డి, విజయ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు డాక్టర్ ప్రభాకర్ కొండూరు, ఉంగళ్‌కాగా ట్రస్ట్ వ్యవస్థాప కుడు డాక్టర్ గడ్డం సునీల్‌రెడ్డి, వ్యాపారవేత్త కలికి రంగారెడ్డి ఈ సలహామండలిలో సభ్యులుగా నియమింపబడ్డారు. మొత్తం 32మందిలో 7మంది నెల్లూరీయులు కాగా వీరిలో కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి చెన్నైలోని అనేక తెలుగు సాహిత్య సాంఘిక కార్యక్రమాల సారధిగా తెలుగువారంద రికీ సుపరిచితుడే. తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి స్వయంగా వీరందరి చేత ఇటీవల ప్రమాణస్వీకారం చేయించాడు.

త్యాగరాయనగర్‌లో వెలసిన పెరు మాళ్ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వసతులు మరింత పెంచి, వచ్చిన ప్రతి స్వామివారి భక్తుడికి సంతృప్తికరంగా దర్శన భాగ్యం కలిగేలా చర్యలు తీసుకుం



**సలహామండలి ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని వై.వి.సుబ్బారెడ్డి నుండి స్వీకరిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి-మాధవి దంపతులు**

టామని కొత్తగా ఏర్పడిన సలహామండలి సభ్యులు చెప్పున్నారు. ఇప్పటికే ఇక్కడున్న టువంటి ఆలయం భక్తులతో క్రిక్కిరిసి పోతుందని, పెరుగుతున్న జనాభాతో పాటు ట్రాఫిక్ కూడా ఎక్కువ కావడం భక్తులకు అసౌకర్యంగా వుందని, ఈ క్రమంలో మద్రాసులోని జిఎన్‌ఆర్ రోడ్డులో విశాలమైన ప్రాంగణంలో స్వామివారి నూతన ఆలయ నిర్మాణ ప్రతిపాదన జరిగిందని, ఇందు కోసం తగిన స్థలాన్ని ఇవ్వవలసిందిగా ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వాన్ని కోరడం, అందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి పళనిస్వామి సానుకూలంగా స్పందించి ఆగమశాస్త్ర ప్రకారం వాస్తును అనుసరించి ఆలయ నిర్మాణం చేపట్టడా నికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసి సూచించ




వలసిందిగా చెప్పారని సలహామండలి నూతన సభ్యులు చెప్పున్నారు. శ్రీవారి సేవలో పాల్గొనే భాగ్యం తమకు కలగడం అదృష్టంగా భావిస్తున్నామని, తనతో పాటు ప్రమాణస్వీకారం చేసినటువంటి తమ ఛైర్మెన్ మరియు ఇతర ఉపాధ్యక్షులు, సభ్యులతో కలిసి ఆలయాన్ని భక్తులకు మరింత చేరువ చేసే దిశగా కృషి చేస్తా మని, తమకు ఇంతటి మహద్భాగ్యాన్ని కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డికి, వారి సతీమణి స్వర్ణమ్మకి కృతజ్ఞతలు తెలుపుకుంటు న్నామని సలహామండలి ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి చెప్పాడు.

# రూసా నిధుల విడుదల పట్ల హర్షం



**వైవి రామిరెడ్డి**

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగ స్వామ్యంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం రాష్ట్రీయ ఉచ్చతార్ సైక్షిక్ అభియాన్(రూసా) ప్రాజెక్ట్ కింద ఎంతో కాలం పెండింగ్‌లో వున్న నిధులను విడుదల చేయడం పట్ల అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర కన్వీనర్ వైవి రామిరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాడు. ఎస్వీ విశ్వవిద్యాలయానికి 41.66కోట్లు, ఆంధ్ర విశ్వవిద్యా లయానికి 41.66 కోట్లు విడుదల చేయడంపై ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపాడు. ఈ రెండు విశ్వవిద్యాలయాలు ఈ నిధులను సద్వినియోగం చేసుకుని విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

## 'ప్రభా'తం

రాజకీయం అన్నది ఒక ఆట అయితే, ఇందులో అన్ని రాజకీయ పార్టీల లక్ష్యం అధికారం అనే గోల్‌ను కొట్టడమే! అయితే ఇంతకుముందు ఆ గోల్‌ను కష్టపడి స్వయంశక్తితో కొట్టేవాళ్ళు, ఇప్పుడు అడ్డదిడ్డంగా, నీతి నియమాలు లేకుండా కొట్టేస్తున్నారు. ఈ విలువలు లేని క్రీడలో ఆ పార్టీ ఈ పార్టీ అని లేకుండా అన్ని పార్టీలు కూడా భాగస్వాములవుతున్నాయి.

దేశ రాజకీయాలలో భారతీయ జనతాపార్టీకి ఒక ప్రత్యేకత వుంది. మిగతా పార్టీలతో పోలిస్తే ఆ పార్టీకి చాలా విశిష్టత వుంటుంది. ఈరోజు ప్రపంచంలోనే పెద్ద రాజకీయ పార్టీలలో బీజేపీ ఒకటంటే దాని నిర్మాణం వెనుక ఎందరో కృషి వుంది, ఎందరి పోరాటమో దాగుంది.

ఈరోజు దేశంలో ఏ పార్టీకీ లేనంత శక్తియుక్తులు, వనరులు బీజేపీకి వున్నాయి. దాదాపు 60ఏళ్ల పాటు ఈ దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌కు ఈరోజు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా పనిచేయగల కార్యకర్తలు లేరు. జెండా మోయాలన్నా రోజుకు రెండొందలు, క్వార్టర్ బాటిల్ ఇవ్వాల్సిన పరిస్థితి. బీజేపీకి అలా కాదు, రేపు ఫలానా రాష్ట్రంలో ఎన్నిక లున్నాయి, ఎలక్షన్ క్యాంపెయిన్ కోసం లక్ష మంది కార్యకర్తలు ఈరోజుకిరోజు అక్కడ దిగిపోవాలన్నా దిగిపోతారు. వాళ్లెవరికీ రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు. స్వచ్ఛంధంగా జెండాలు మోస్తారు. పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తారు. ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఏబివిపి వంటి పెద్దపెద్ద ఆర్గనైజేషన్స్ అన్నీ కూడా బీజేపీ కోసం పని చేసేవే!

నిన్నటివరకు క్రమశిక్షణ, రాజకీయాలలో అంతో ఇంతో విలువలకు కట్టుబడ్డ పార్టీగా బీజేపీకి పేరుండేది. ఈమధ్య కాలంలో ఆ పేరు కూడా తెరమరుగవుతోంది. ముఖ్యంగా పార్టీలో వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్‌జోషి వంటి సీనియర్‌ల ప్రభావం తగ్గిన తర్వాతే, ఆ పార్టీ ట్రాక్ మారింది. ముఖ్యంగా నరేంద్ర మోడీ, అమిత్‌షాల ద్వయం చేస్తున్న రాజకీయ విధ్వంసకాండను చూస్తుంటే ఒకప్పటి కాంగ్రెస్ అరాచకాలే మేలనిపించేలా వున్నాయి.

అర్ధరాత్రిళ్ల ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలోనూ, అర్థాంతరంగా తమ మద్దతుతో నడుస్తున్న ప్రభుత్వాలను కూల్చడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ట్రాక్‌రికార్డ్ వుంది. 6 దశాబ్దాల పాటు కాంగ్రెస్‌పార్టీ వాళ్ళు కష్టపడి సాధించిన ఈ ట్రాక్‌రికార్డును మోదీషాల ద్వయం 6ఏళ్లలోపే బ్రేక్ చేసింది. అర్ధరాత్రిళ్ల రాజకీయ సన్నివేశాలను మార్చడంలో మమ్మల్ని మించిన మొనగాళ్ళు లేరని నిరూపించుకున్నారు. మహారాష్ట్రలో నెలరోజులుగా ఏం జరుగుతుందో చూస్తున్నాం... ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాక, బీజేపీ - శివసేన కూటమికి మెజార్టీ వచ్చినప్పటికీ, సీఎం సీటు విషయంలో శివసేన అడ్డం తిరిగి రాజకీయాలు రసకందాయంలో పడడం తెలిసిందే! అధికారం కోసం ఎలాంటి గడ్డినైనా కరుస్తామనే రీతిలో కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలపడానికి శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరే ముందుకు రావడం, సైద్ధాంతిక వైరిపక్షాలైన కాంగ్రెస్, ఎన్సీపీల మద్దతుతో ఉద్దవ్ థాకరే ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టడానికి సన్నద్ధం కావడం తెలిసిందే! ఆయన ఇంటికి వెళ్లి రేపు ఉదయం ప్రమాణస్వీకారానికి ఏ డ్రెస్ వేసుకోవాలనే ఆలోచన చేస్తున్నప్పుడే ముంబైలో రాత్రికి రాత్రి రాజకీయం మారిపోయింది. అమిత్‌షా శరద్‌పవార్ కొంపలో అప్పటికే చిచ్చు పెట్టేశాడు. శరద్‌పవార్ సోదరుడి కొడుకైన అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో ప్లేటు ఫిరాయించి బీజేపీకి మద్దతు పలికాడు. దీంతో వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఏమూల కూర్చున్నా ఒకటే అన్నట్లు గవర్నర్ తమవాడే కావడంతో వాళ్లకు పూర్తి మెజార్టీ వుందో లేదో కూడా పరిశీలించకుండానే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాడు. దీంతో ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్‌ల ప్రమాణస్వీకారం జరిగిపోయింది. అజిత్‌పవార్ వర్గం మద్దతు తెలిపినప్పటికీ బీజేపీ వద్ద పూర్తి మెజార్టీ లేదు. ఇంకో పాతికమంది ఎమ్మెల్యేలు వస్తేగాని ఫడ్నవీస్ ప్రభుత్వం నిలిచే పరిస్థితి లేదు. శివసేనలో చీలిక వస్తుందని, ఇండిపెండెంట్లు తమ వెంట వస్తారనే నమ్మకంతో బీజేపీ అధిష్ఠానం ఉండింది. అవతల ఎమ్మెల్యేలతో బేరసారాల కోసమన్నట్లుగా గవర్నర్ కూడా వాళ్లకు బల నిరూపణ కోసం కావాల్సినంత సమయం ఇచ్చాడు.

మరోపక్క, ఎలాగైనా బీజేపీని పడగొట్టి శివసేన నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే పట్టుదలతో కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేనలు ఉమ్మడిగా ఎమ్మెల్యేల క్యాంప్‌ను ఏర్పాటు చేశాయి. తమ శిబిరంలో 162 మంది ఎమ్మెల్యేలున్నట్లుగా వాళ్ళు చూపించారు.

మొత్తానికి మహారాష్ట్ర రాజకీయాలలో నాలుగు పార్టీలు కూడా నీతిబాహ్యమైన క్రీడనే ఆడాయి. అధికారం కోసం అన్ని అడ్డదారులు తొక్కాయి. ఇందులో కేంద్రంలో అధికారంలో వుంది కాబట్టి బీజేపీ కొంచెం వేగంగా ఆట ఆడింది. పూర్తి మెజార్టీ లేనప్పటికీ గతంలో గోవా, కర్నాటక, మేఘాలయ వంటి రాష్ట్రాలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనుభవంతో మహారాష్ట్రలోనూ అదే వ్యూహంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, సుప్రీం కోర్టులో సీన్ రివర్స్ అయ్యింది. బీజేపీకి మహారాష్ట్ర గవర్నర్ ఇచ్చిన అవకాశాన్ని సుప్రీం కోర్టు ఇవ్వలేదు. 27వ తేదీ వరకు మాత్రమే బల నిరూపణకు అవకాశం ఇవ్వడంతో ఫడ్నవీస్ అర్థాంతరంగా అస్త్రసన్యాసం చేయాల్సివచ్చింది. దీనికితోడు ఉపముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజిత్ పవార్ కూడా చివరికి తన బాబాయ్ శరద్‌పవార్ చెంతకే చేరాడు. దీంతో శివసేన-కాంగ్రెస్-ఎన్సీపిల ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. 'మహా'పీఠంపై ముఖ్యమంత్రిగా ఉద్ధవ్‌థాక్రే ఆశీనుడయ్యాడు. ఇక ఇప్పుడు బంతి కాంగ్రెస్‌పార్టీ చేతిలో ఉంది. ఈ ప్రభుత్వాన్ని ఎంత కాలం బ్రతకనిస్తుందో చూడాలి!

### ముగిసిన 'మహా' డ్రామా



మహారాష్ట్ర రాజకీయాలలో నాలుగు పార్టీలు కూడా అధికారం కోసం అన్ని అడ్డ దారులు తొక్కాయి. అధికారంలో వుంది కాబట్టి బీజేపీ కొంచెం వేగంగా ఆట ఆడింది. పూర్తి మెజార్టీ లేనప్పటికీ గతంలో గోవా, కర్నాటక, మేఘాలయ వంటి రాష్ట్రాలలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనుభవంతో మహారాష్ట్రలోనూ అదే వ్యూహంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, సుప్రీం కోర్టులో సీన్ రివర్స్ అయ్యింది. 27వ తేదీ వరకు మాత్రమే బల నిరూపణకు అవకాశం ఇవ్వడంతో ఫడ్నవీస్ అర్థాంతరంగా అస్త్రసన్యాసం చేయాల్సివచ్చింది. దీంతో శివసేన-కాంగ్రెస్-ఎన్సీపిల ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. 'మహా'పీఠంపై ముఖ్యమంత్రిగా ఉద్ధవ్‌థాక్రే ఆశీనుడయ్యాడు.

---

### మైపాడు సాగరతీరంలో
## హరిహరుల కళ్యాణోత్సవాలు

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మైపాడులోని సాగరతీరంలో కొలువైవున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 24న శివపార్వతుల కల్యాణం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ వేడుకలు ఒకే వేదికపై ఎంతో కన్నుల పండువగా జరిగాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్ల కల్యాణోత్సవాలను తిలకించి పులకించిపోయారు. అనంతరం, ఆలయంలోని 25 అడుగుల పరమేశ్వరుని వాయులింగానికి ప్రత్యేకపూజలు అభిషేకాలు చేశారు. స్థానిక షిర్డీసాయి భక్తబృందం ఆధ్వర్యంలో, చందోలు శ్రీకాంత్‌శర్మ, బండారు ప్రభాకర్‌శర్మల నేతృత్వంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివార్ల కల్యాణాలు నయనానందకరంగా జరిగాయి.

ఈ వేడుకల సందర్భంగా వేదిక వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ అత్తివరదరాజస్వామి విగ్రహాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాదీపాన్ని వెలిగించి పూజలు చేశారు.

## దశరథ్యను పరామర్శించిన నారాయణ

అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ సీపీఐ నాయకుడు పముజుల దశరథరామయ్యను ఈనెల 23న సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ నెల్లూరు జిల్లా సౌత్ మోపూరు గ్రామంలోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నగర కార్యదర్శి మునీర్, రైతు సంఘం నాయకుడు షానవాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ సిరాజ్, దయాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మతపరమైన మోసాలను అరికట్టాలి

మనం ఆధునిక నాగరికత సమాజంలో వున్నాం. మంత్రాలకు చింతకాయలు రాలే మూఢ నమ్మకాల కాలం పోయింది. అయినా కూడా మతాలు, దేవుళ్ల పేరుతో ఇంకా కొందరు అమాయక ప్రజలను మోసం చేస్తూనేవున్నారు. ముఖ్యంగా ఇటీవలకాలంలో ఫాదర్‌లు, పాస్టర్‌లు అమాయక ప్రజలను మభ్యపెట్టడం ఎక్కువైంది. మత సభలలో పాస్టర్‌లు చేసే విన్యాసాలు వికృతంగా వుంటున్నాయి. రోగాలను మాయం చేయడం, చచ్చినవారిని బ్రతికించడం, పిల్లలు లేని స్త్రీలను గర్భవతులను చేయడం, పొట్టివారిని పొడుగు పెరిగేటట్లుగా చేయడం... ఇవన్నీ అభూతకల్పనలు, దేవుడు అన్నది ఒక నమ్మకం, సైన్స్ ఒక నిజం, మతం అన్నది మానసిక వికాసానికి, ప్రశాంతతకు పరిమితం కావాలి. మత ప్రార్ధనలతో రోగాలు తగ్గేటట్లయితే, మనిషి అనుకున్నవన్నీ నెరవేరేటట్లయితే దేశం నిండా ఇన్ని హాస్పిటల్స్ ఎందుకు? రోగాలను నయం చేసుకోవడానికి ఆసుపత్రుల చుట్టూ తిరిగి డబ్బు ఖర్చు చేసుకోవడమెందుకు? మూఢనమ్మకాలను ప్రేరేపించే ఇలాంటి మతపరమైన కార్యక్రమాలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించాల్సివుంది.

**ఎస్.డి.మహబూబ్, నెల్లూరు.**

## దేవిరెడ్డి ప్రకటన అభినందనీయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయుల సంక్షేమమే తన మొదటి ప్రాధాన్యత అని ఆంధ్రప్రదేశ్ నూతన ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ప్రకటించడం అభినంద నీయం. సుదీర్ఘకాలం పాత్రికేయ రంగంలో వుంటూ పాత్రికేయుల సమస్యలపై మంచి అవగాహన వున్న ప్రతిభాశాలి శ్రీనాథ్‌రెడ్డి. వైయస్ రాజశేఖరరెడ్డి గారికి ఎంతో సన్నిహితులు. వారికి మీడియా విషయాల్లో పలు సూచనలు, సలహాలు అందించేవారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి గారికి కూడా పత్రికా విషయాలకు సంబంధించి మంచి సలహాలు ఇస్తున్నారు. వారి ప్రతిభను గుర్తించి ఆంధ్రప్రదేశ్ నూతన ప్రెస్‌అకాడమీ ఛైర్మెన్‌గా దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డిని ముఖ్యమంత్రి నియమించడం సముచితం.

**డా. యస్.బాబురావు, కావలి.**




## తెలుగు మీడియం తీయొద్దు!

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టాలన్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం సహేతుకమైనదే! అదే సమయంలో తెలుగు మీడియంను పూర్తిగా తొలగించవద్దని మనవి. ఎందుకంటే సైన్స్, సోషల్, గణితం వంటి సబ్జెక్ట్‌లలో వున్న సారాన్ని తెలుగులో కూడా నేర్చుకోవాల్సివుంది. కొన్ని సబ్జెక్ట్‌లలో అంశాలను రైతులకు, సామాన్య ప్రజలకు వివరించాల్సి వచ్చినప్పుడు వారికి ఇంగ్లీష్‌లో చెబితే అర్థం కావుకదా! అందుకనే ఆ సబ్జెక్ట్‌లు తెలుగులో తెలిసిన వాళ్ళు వుండాలి. అలానే అందరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, విదేశీఉద్యోగాల దృష్టితో చదవరు. డిగ్రీ, బి.టెక్, ఇంటర్ వరకు చదివి తమ ఊర్లో, తమ జిల్లాలో, లేదా తమ రాష్ట్ర పరిధిలో వివిధ రంగాలలో పని చేయాలనుకునేవారికి తెలుగు మీడియం అవసరం. కాబట్టి తెలుగు మీడియంను పూర్తిగా ఎత్తేయొద్దు.

**కంతేటి సుబ్రహ్మణ్యం, చెన్నూరు.**

## ఇద్దరూ ఇద్దరే!

మహారాష్ట్రలోని నాలుగు ప్రధాన రాజకీయపక్షాలు కూడా అధికారం విషయంలో గబ్బుపట్టాయి. శివసేనకు మద్దతు పలకడం ద్వారా కాంగ్రెస్, ఎన్సీపీలు తమ సిద్ధాంత వైఖరి నుండి బయటకొచ్చేశాయి. బీజేపీని గుడ్డిగా వ్యతిరేకించే క్రమంలో తామూ విలువలను కోల్పోతున్నామనే విషయం వారికి అర్థం కావడం లేదు. అదే సమయంలో కాంగ్రెస్‌తో స్నేహానికి సిద్ధపడి శివసేన తన సహజత్వాన్ని, స్వర్గీయ బాల్‌థాకరే సిద్ధాంత భావజాలాన్ని కోల్పోయింది. ఇక ఎన్సీపీని చీల్చడం ద్వారా అయితేనేమి, పూర్తి మెజార్టీ లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్లనైతేనేమి బీజేపీ తన అధికారదాహాన్ని బయటపెట్టుకుంది.

**ఎం.వి.రమణయ్య, హైదరాబాద్.**

# గవర్నర్‌ను సత్కరించిన ఆదాల



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఏపి భవన్‌లో నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ద్వారా సహకరించాలని గవర్నర్‌ను ఆదాల కోరారు.

# 'దేశం' అధ్యక్షుడెవరు?



○ బీద వదిలించుకుంటాడా?



○ సోమిరెడ్డి తగిలించుకుంటాడా?



○ పెళ్లకూరు సై అంటాడా?

ఒకప్పుడు అధికారపార్టీ జిల్లా అధ్యక్షుడి కంటే కూడా ప్రతిపక్ష పార్టీ జిల్లా అధ్యక్షుడు పవర్‌ఫుల్‌గా వుండేవాడు. ప్రతిపక్ష పార్టీ అధ్యక్ష పదవి కోసం నాయకుల మధ్య పోటీ వుండేది. అప్పుడంటే రాజకీయాలలో విలువలుండేవి, నాయకులు పార్టీ మారడం అన్నది ఎప్పుడో జరిగేది. పార్టీలకు కరడుగట్టిన అభిమానులు, కార్యకర్తలు వుండేవాళ్ళు. పార్టీ ధర్నాకు పిలుపునిచ్చినా, బంద్ చేయాలన్నా రూపాయి ఖర్చు లేకుండా వచ్చి జెండాలు పట్టుకునేవాళ్ళు, రోడ్ల మీద కూర్చునేవాళ్ళు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. పార్టీ కార్యకర్త అయినా కాకపోయినా ఒక మనిషి మీటింగ్‌కు రావాలంటే ఒక రేటు, ధర్నాలో పాల్గొనాలంటే ఒక రేటు... కనీసం వందమందితో కలిసి గాంధీబొమ్మ వద్ద కూర్చుని ధర్నా చేయాలన్నా కనీసం 50వేల ఖర్చుతో కూడుకున్న పనైంది. పార్టీ అధ్యక్ష బాధ్యతలు చూసేవాళ్ళు వీటన్నింటిని భరించాలి. ప్రతిపక్షంలో వున్న పార్టీ ఒట్టిపోయిన గేదెలాంటిది. పిండుకోవడానికి పాలుండవు. గడ్డి మాత్రం వేస్తుండాల్సిందే... ఆ బాధ్యత జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నవాళ్ళదే! పార్టీ జిల్లా అధ్యక్షపదవి ఆర్థిక భారంతో కూడుకున్నది కాబట్టే ఇప్పుడు ఆ పదవులపై ఏ నాయకుడూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఆరునెలల క్రితంవరకు తెలుగుదేశం అధికారంలో వుంది. ఆరు నెలల నుండి ప్రతిపక్షంలోకి మారింది. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు కొంతకాలం, అధికారంలో వున్న ఐదేళ్లు బీద రవిచంద్ర జిల్లా తెలుగుదేశం అధ్యక్ష బాధ్యతలు చూశాడు. అంతకుముందు పార్టీ ప్రతిపక్షంలో వున్న సుదీర్ఘకాలంలో పార్టీ అధ్యక్షుడిగా సోమిరెడ్డి నెట్టుకొచ్చాడు.

ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడి మార్పుపై ఊహాగానాలు రేగుతున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు తీసుకోవడానికి ఎవరైనా ముందుకొస్తే తప్పుకోవడానికి బీద రవిచంద్ర సిద్ధంగా వున్నట్లు తెలుస్తోంది. కొత్తవారికి అవకాశం కల్పించాలనే ఆలోచనలో ఆయనున్నాడు. అదీగాక జిల్లాలో అధికారిక పదవి(ఎమ్మెల్సీ) వుండే ఏకైక తెలుగుదేశం నాయకుడు ఆయనే! కాబట్టి జోడుపదవులను కాకుండా ఒకే పదవితోనే సర్దుకోవాలనుకుంటున్నాడు. ఆయన తప్పుకుంటే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తిరిగి పగ్గాలు చేపడతాడా? రెడ్డి సామాజికవర్గం బలంగా వున్న జిల్లాలో సోమిరెడ్డి అయితే జిల్లా అధ్యక్ష పదవికి కరెక్ట్ అనే అభిప్రాయం వుంది. గతంలో పార్టీని సమర్థవంతంగా నడిపిన అనుభవం ఆయనది. అయితే ఈ దశలో ఆయన మళ్ళీ అధ్యక్ష పదవికి రావడం కష్టమే!

ఇక వీళ్లిద్దరూ కాకుంటే మూడోపేరు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి. 2019 ఎన్నికల లిస్టులో అదృష్టవంతుడు. ఎందుకంటే చంద్రబాబు అతనికి ఎక్కడా సీటివ్వకుండా నెత్తిన పాలుపోశాడు... ఆ ఎన్నికలలో ఖర్చుపెడదామనుకున్న డబ్బు మిగిల్చుకున్నాడు. అంత గాలిలో కూడా తెలుగుదేశాన్ని వదిలిపోకుండా నిలబడ్డాడు. పార్టీ పట్ల చిత్తశుద్ధితో పని చేయడానికి ఉత్సాహంగా కూడా వున్నాడు. కాబట్టి అధ్యక్ష పదవికి వాళ్లిద్దరు కాకుంటే పెళ్లకూరే కరెక్ట్ అనే అభిప్రాయం వుంది.



నెల్లూరులో పేరుమోసిన ధనవంతులుగా కొందరికి గుర్తింపు వుంది. వారందరూ వ్యక్తులే. వీళ్లలాగే ఇంకో కోటీశ్వరుడు కూడా వున్నాడు. నగరంలో పెద్ద భూస్వామి ఆయనే! ఆయనకున్న భూమి విలువ ఎకరా కోట్లలో వుంటుంది. ఆయనే నెల్లూరు మూలాపేటలో వున్న వేణుగోపాలుడు. నిజమే నెల్లూరులో ఆయన పెద్ద కోటీశ్వరుడే! కాని ఏం లాభం... గోరంత అప్పుకు కొండంత ఆస్థిని అమ్మకానికి పెట్టాల్సి వస్తోంది.

# గోరంత అప్పుకు... కొండంత ఆస్థి అమ్మాలా?

నెల్లూరు, మూలాపేటలోని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి నగరంలో వందలకోట్ల విలువచేసే ఆస్తులున్నాయి. 1880 దశకంలో కంటాబత్తిన సుబ్బమ్మ అనే భక్తురాలు స్వామివారికి భక్తితో వందల ఎకరాల భూమిని సమర్పించుకుంది. ఈ భూముల కౌలుద్వారానే ఆలయ నిర్వహణ జరిగేది. అప్పట్లో ఆలయ నిర్వహణకు 8మంది సభ్యులతో కమిటీ వేయగా కాలక్రమంలో అది ఐదు కుటుంబాలకు పరిమితమైంది. ప్రస్తుతం ఐదుగురు సభ్యులతో కూడిన ట్రస్ట్‌బోర్డు పర్యవేక్షణలో ఆలయ నిర్వహణ వుంటోంది. ఆలయానికి ఇ.ఓ కూడా వుండరు. ట్రస్ట్ స్వతంత్ర పర్యవేక్షణలోనే కార్యక్రమాలు నడుస్తుంటాయి. ముఖ్యంగా ఆనం వివేకానందరెడ్డి మరణించేవరకు ఈ కమిటీలో సభ్యుడిగా లేదా అధ్యక్షుడిగా వుండేవారు. వారి ప్రాబల్యం వల్ల ఇందులో ప్రభుత్వం జోక్యం చేసుకునే పరిస్థితి రాలేదు.

## దండిగా ఆస్తులు..

వేణుగోపాలస్వామి దేవస్థానానికి నగర పరిధిలో 40ఎకరాలు, పరిసర గ్రామాలలో 40ఎకరాల భూములున్నాయి. నగరంలో మాగుంట లే అవుట్‌లో 11ఎకరాలు, జాతీయ రహదారికి ఆనుకుని 10ఎకరాలు, జగదీష్‌నగర్‌లో 5.93ఎకరాలు, జిపిఆర్ కళ్యాణ మండపం ఎదురుగా 3ఎకరాలేకాక నగరంలో ఇంకా పలుచోట్ల విలువైన ఆస్తులున్నాయి. వీటన్నింటి విలువ వందలకోట్లలో వుంటుంది.

అయితే, స్వామికి ఇన్ని వందలకోట్ల ఆస్తులున్నా వాటి మీద రాబడి తక్కువ. నగరం నడిబొడ్డున వుండే పొలాల్లో వరి పండిస్తే ఏం రాబడి వస్తుంది. స్వామి వారి స్థలాలు చాలావరకు నిరుపయోగంగా ఖాళీగా వుండడంతో వాటిపై ఆదాయం రావడం లేదు. ఆలయ నిర్వహణకు నిధుల కొరత వుందని, సిబ్బంది జీతభత్యాలకు కూడా నిధులు చాలడం లేదని, దేవస్థానానికి చెందిన కొన్ని ఆస్తులు అమ్మి అప్పులు తీర్చాలని చెప్పి 2013లో దేవస్థానం ఛైర్మెన్‌గా వున్న ఆనం వివేకానందరెడ్డి అప్పటి గవర్నర్ ద్వారా అనుమతి తీసుకున్నాడు. దీనికి సంబంధించి గెజిట్ నోట్ కూడా విడుదలైంది. అయితే ఆయన ఎందుకో మళ్లీ మనసు మార్చుకుని ఆ గెజిట్‌నోట్‌ను పక్కనపెట్టేశాడు. బహుశా ఒకసారి దేవస్థానం ఆస్తుల అమ్మకం మొదలుపెడితే భవిష్యత్‌లో ఇంకేమీ మిగలబోదని ఆలోచించి వుండొచ్చు. అంతకు కొన్ని సంవత్సరాల ముందే ఆదిత్యనగర్‌లో దేవస్థానం భూమిని కొంత అమ్మేశారు.

## అప్పుకు ఆస్థికి సంబంధం లేదు...

దేవస్థానంకు గట్టిగా 2కోట్ల అప్పులుంటాయి. కాని వీటిని తీర్చడం కోసంగా దేవస్థానానికి చెందిన దాదాపు 4ఎకరాల విలువైన స్థలాన్ని అమ్మదానికి చూస్తున్నారు. ప్రస్తుతం అమ్మాలనుకుంటున్న వాటిలో మినీబైపాస్‌లో 70సెంట్లు, పుట్లవీధిలో 17సెంట్లు, సింహపురి ఆసుపత్రి వెనుక 1.61 ఎకరాలు, మినీ బైపాస్‌లో ద్రమో షోరూమ్ వెనుక 2ఎకరాలు వుంది. ఎంత కాదనుకున్నా వీటి విలువ 35 నుండి 40కోట్ల మధ్యలో వుంటుంది. రెండు కోట్ల అప్పుకు ఇంత ఆస్థి అమ్మాలా? ఆస్థిని అమ్మేబదులు వాటిని లీజుకివ్వడం ద్వారా వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చవచ్చుకదా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

## కమిటీలోనే భేదాలు...

దేవస్థానం కమిటీ ఛైర్మెన్ ఆస్తులు అమ్మి అప్పులు తీర్చాలని భావిస్తుండగా, ట్రస్ట్ సభ్యులు మాత్రం దానిని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్తులు అమ్మకం ఒకసారి మొదలుపెట్టారంటే, ఆస్తులన్నీ కర్పూరంలా కరిగిపోయి వేణుగోపాలుడు చివరకు కుచేలుడు అవుతాడేమోనని భక్తుల భయం. అందుకే నిరుపయోగంగా వున్న ఆస్తులను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించేలా మార్పు చేసి అప్పులు తీర్చాలని, అలాగే ప్రతి సంవత్సరం నికర రాబడి వుండేలా ఏర్పాట్లు చేసి ఆలయ నిర్వహణ సజావుగా సాగిపోయేలా చూడాలని భక్తుల విన్నపం.

# పోతే పది లక్షలు... ఛాన్స్ కొడితే కోట్లు...

❑ మారిన ఎక్సైజ్ పాలసీ ❑ ప్రస్తుత బార్ లైసెన్స్‌ల రద్దు ❑ 2020 నుండి కొత్త బార్లు




రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని అమలులోకి తెచ్చింది. దీనిప్రకారం ప్రస్తుతమున్న బార్ల లైసెన్స్‌లన్నీ డిసెంబర్ 31వ తేదీతో రద్దు కాబోతున్నాయి. కొత్త లైసెన్స్ విధానంతో కొత్త బార్లు రాబోతున్నాయి.

రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించే దిశగా మరో ముందడుగు వేసింది. బెల్టుషాపులను ఎత్తేయడం, మద్యం షాపులను తగ్గించడమే కాక, వాటిని తమ ఆధీనంలోకి తెచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు బార్ల పైన కూడా దృష్టి పెట్టింది. బార్‌లు ఎక్కువగా నగర, పట్టణ ప్రాంతాలలోనే వుంటాయి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో విచ్చలవిడిగా బార్‌లకు లైసెన్స్‌లిచ్చి వున్నారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం వాటిని నియంత్రించే చర్యలకు పూనుకుంది. ఇప్పుడున్న బార్లను 40శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. అంతేకాదు, వాటికి లైసెన్స్ ఫీజులను కూడా ఖరారు చేసింది. లక్ష లోపు జనాభా వున్న పట్టణాలలో 25లక్షలు, 5 లక్షల లోపు జనాభా వున్న పట్టణాలలో 50లక్షలు, 5 లక్షలు పైన జనాభా వున్న నగరాలలో 75లక్షలు బార్ లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. బార్ లైసెన్స్ దరఖాస్తును 10లక్షలుగా నిర్ణయించారు. అంటే ఒక బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే లైసెన్స్ వచ్చినా రాకున్నా ఆ పదిలక్షలు తిరిగిరావు. 10లక్షలు ఇచ్చి లాటరీ టిక్కెట్ కొన్నట్లేనన్నమాట!

## లక్కీడిప్ ద్వారానే...

బార్ లైసెన్స్‌లను లక్కీడిప్ ద్వారా నిర్ణయించనున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వైన్‌షాపుల లైసెన్స్‌లను లాటరీ ద్వారా నిర్ణయించేవాళ్ళు. ఒక్కో వైన్‌షాపుకు 5నుండి వందదాకా దరఖాస్తులొచ్చేవి. వాటిలో లాటరీ తగిలినవాళ్లు తమ లైసెన్స్‌లను అమ్ముకున్న సందర్భాలు కూడా వున్నాయి.

## లైసెన్స్ వస్తే పండుగే!

ఈసారి బార్ లైసెన్స్ వచ్చిన వ్యాపారులకు పండుగే! ఎందుకంటే బార్లలో ఈసారి మద్యం అమ్మకాలు విపరీతంగా పెరుగుతాయి. వైన్‌షాపులు ప్రభుత్వ ఆధీనంలో వున్నాయి. ప్రభుత్వ ఆఫీసుల మాదిరిగానే వాటికి టైం మెయింటెనెన్స్ చేస్తున్నారు. రాత్రి పొద్దుపోతే వైన్‌షాపులు మూసేస్తున్నారు. ఎక్కువమంది మద్యం ప్రియులకు మద్యం తీసుకోవాలనే కోరిక కలిగేదే రాత్రి 9గంటలుపైన. అప్పుడు వైన్‌షాపులుండవు. బార్‌లే దిక్కు. అదీగాక వైన్‌షాపుల్లో బీర్లు కూలింగ్‌లో వుండవు. కాబట్టి బీర్లు తాగాలనుకునే వారికి కూడా బార్‌లే దిక్కు. అట్లాగే ఇప్పుడున్న బార్లలో సగానికి పైగా బార్లు తగ్గుతాయి. కాబట్టి బార్‌లకు వ్యాపారం దండిగా వుంటుంది. లైసెన్స్ దొరికితే లక్కీఛాన్సే!

# నిధుల లెక్కలు తేల్చాలి

**• విఆర్‌సిలో మంత్రి అనిల్ హుకుం**



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ సోమవారం నెల్లూరులోని విఆర్ కళాశాలను సందర్శించారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, విఆర్‌సి ప్రత్యేక అధికారి పి.వినోద్‌కుమార్‌లతో కలిసి ఆయన విఆర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందితో సమావేశమయ్యారు. కళాశాలలో ఎంతమంది ఉద్యోగులున్నారు, వారు విధులకు వస్తున్నారా అని మంత్రి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే కళాశాల ఆదాయ వనరుల గురించి ఆయన ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించాడు. కళాశాల నిధుల దుర్వినియోగం పై విచారణ జరిపించాలని, సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని మంత్రి జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించాడు. కళాశాలకు వచ్చే నిధులు, ఖర్చులు, ఉద్యోగుల జీతాలకు సంబంధించిన రికార్డులను కూడా వారంలోపు తీసుకురావాలని, లేకుంటే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని జేసీకి మంత్రి సూచించాడు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ కళాశాల పూర్వవైభవానికి కృషి చేస్తున్నామని, కళాశాలకు అవసరమైన ఉద్యోగులను నియమిస్తామని, కళాశాల మైదానాన్ని వాణిజ్య కార్యక్రమాలకు కాకుండా కేవలం క్రీడలకు మాత్రమే వాడేలా చూస్తామని ఆయన స్పష్టం చేశాడు. జనవరి నెలకల్లా కోటి రూపాయల సిఎస్‌ఆర్ నిధులతో కళాశాల అభివృద్ధి పనులు మొదలుపెడతామని చెప్పాడు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, అజయ్, కామేశ్వరరావు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయం ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇది రౌడీ రాజ్యమా?

**- కోటంరెడ్డి శీనయ్య**



కొడాలి నాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెదేపా నాయకులు

రాష్ట్రంలో రౌడీరాజ్యం నడుస్తోందని విమర్శించాడు నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుపై మంత్రి కొడాలి నాని చేసిన విమర్శలను ఖండిస్తూ ఈ నెల 23న నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో శీనయ్య ఆధ్వర్యాన నాని ఫోటో ఫ్లెక్సీని తగలబెట్టాడు. ఈ సందర్భంగా శీనయ్య మాట్లాడుతూ కొడాలి నాని మాటలు సభ్యసమాజం తల దించుకునేలా వుంటున్నాయని, విలువలు మరచి, సంస్కారం విడిచి నోటికొచ్చినట్లు వాగడం తగదన్నాడు. తిరుమల శ్రీనివాసుడు కలియుగ దేవుడని, కోట్లాదిమంది విశ్వాసమని, తిరుమల పవిత్రతకు భంగం కలిగేలా మాట్లాడిన నానిని పార్టీ నుండి బర్తరఫ్ చేసి, 20ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, ధర్మవరం సుబ్బారావు, పడవల కృష్ణమూర్తి, కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### తమిళనాడు సిడిపిఓలకు

## నెల్లూరులో శిక్షణ

తమిళనాడు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలోని 35మంది సిడిపిఓలకు నెల్లూరులోని హోటల్ అతిథిగ్రాండ్ సమావేశ మందిరంలో శిక్షణనిస్తున్నారు. సోమవారం మొదలైన ఈ శిక్షణ శుక్రవారంతో ముగుస్తుంది. ఏపిలో స్త్రీ శిశు సంక్షేమశాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, గ్రామాలలో శిశు సంరక్షణ, మాతా శిశు మరణాల తగ్గింపు, గ్రామీణ వైద్యం తదితర అంశాలపై వారికి శిక్షణనిచ్చారు. ఢిల్లీలోని నిప్‌సిడ్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ పూర్ణిమా ఠాకూర్, డా. వి.డి.గడ్కర్, బెంగుళూరు రీజనల్ డైరెక్టర్ డా.గంగా జ్యోతిల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.



### శ్రీహరినగర్ రోడ్డును

## భ్రష్టు పట్టించారు

నెల్లూరు నగరంలో వున్న మంచి కాలనీలలో శ్రీహరినగర్ ఒకటి. మినీబైపాస్‌రోడ్డును ఆనుకుని తెలుగుదేశం పార్టీ ఆఫీసు ఎదురుగా వున్న ప్రాంతం. రోడ్లు విశాలంగా వుంటాయి. ఈమధ్య కాలంలో బాగా అభివృద్ధి చెందుతోంది. కృష్ణపట్నంపోర్ట్ వాళ్ళు రోడ్లకిరువైపులా మొక్కలు నాటి మంచి వాతావరణం తెచ్చారు. శ్రీహరినగర్ మెయిన్‌రోడ్డు ఎంతో విశాలంగా వుంటుంది. గతంలో జీబ్రామార్కులతో వేసిన ఈ రోడ్డును చూస్తే ఎయిర్‌పోర్ట్ రన్‌వే గుర్తుకొచ్చేది. అలాంటి రోడ్డును భూగర్భడ్రైనేజ్ పేరుతో గత ప్రభుత్వంలో గబ్బు పట్టించారు. భూగర్భ డ్రైనేజీ పనుల కోసమని రోడ్డుకు ఉత్తరం వైపు అంతా తవ్వారు. పైప్‌వేసిన తర్వాత పూడ్చారు. దానిపైనే హడావిడిగా తారురోడ్డు వేశారు. ఆ హడావిడిగా రోడ్డు వేసిన ఫలితాన్ని స్థానికులు ఇప్పుడు అనుభవిస్తున్నారు. పైప్‌లైన్ వేసిన రోడ్డు అంతా కూడా కుంగిపోతోంది. సోమవారం ఒక గ్రావెల్ లారీ అయితే ఈ రోడ్డులో సగం దిగబడిపోయింది. క్రేన్‌ల సాయంతో ఆ లారీని బయటకు తీశారు. ఈ రోడ్డంతా డొల్లగానే వుంది. పూర్తిస్థాయిలో మళ్ళీ మట్టిని తవ్వి నిబంధనల ప్రకారం క్యూరింగ్ చేసి బాగా గట్టి పద్ధాక రోడ్డు వేస్తేనే ఈ రోడ్డు నిలబడుతుంది.

### సైకత శివలింగానికి

## విశేష పూజలు

పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న నెల్లూరు పెన్నానదిలో చివరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైకత శివలింగానికి నిర్వాహకులు విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి గంధం,విభూది, పాలు, కొబ్బరి, నీళ్ళు, పన్నీరుతో అభిషేకాలు నిర్వహించి చందనం, పూలతో అలంకరించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మోపూరు పెంచలయ్య, దువ్వూరు శరత్ చంద్రబాబు మాట్లాడుతూ గత 14ఏళ్ళుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మునీంద్ర, బుజ్జయ్య, కృష్ణారెడ్డి, ఈశ్వర్, మురళీ, కిషోర్, నాగరాజు, చొక్కలింగం, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## అబుదాబి సదస్సులో కలెక్టర్



విద్యావిధానం, ఈ-లెర్నింగ్‌పై ఈ నెల 27, 28 తేదీలలో అబుదాబి వేదికగా జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఏపి ప్రభుత్వ ప్రతినిధిగా నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పాల్గొనడం విశేషం. ఈ సదస్సులో పాల్గొనే అరుదైన అవకాశాన్ని ప్రభుత్వం ఆయనకు కల్పించింది.

## రైతుబజారులో బారులు

నెల్లూరులో ఫత్తేఖాన్‌పేట, నవాబుపేటలలో రెండు రైతుబజార్లున్నాయి. వీటి కెప్పుడూ జనాలు పోరు. ఎప్పుడూ వెలవెలపోతూ కనిపిస్తూ నిరుపయోగంగా వుంటాయి. అలాంటి రైతుబజార్లు ఇప్పుడు సందడిగా కనిపిస్తున్నాయి. కారణం ప్రభుత్వం రైతుబజార్ల ద్వారా తెల్లకార్డు దారులకు ఉల్లిపాయలు కిలో 25రూపాయలకు ఇస్తుండడమే. బయట మార్కెట్‌లో ఉల్లిపాయలు చిన్నవైతే కిలో 80రూపాయలు, పెద్దవైతే 100 రూపాయలుగా వున్నాయి. బయట మార్కెట్‌లో ఈ రేట్లు పెట్టి కొనలేకే వినియోగదారులు రైతుబజార్లలో క్యూలు కడుతున్నారు.

## డిపిఓగా ధనలక్ష్మి

జిల్లా పంచాయితీ అధికారిగా ధనలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. చిత్తూరుజిల్లా కలకడ ఎంపిడిఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం సెట్రల్ సిఇఓ సుస్మిత ఇన్‌ఛార్జ్ డిపిఓగా వ్యవహరిస్తుండడం తెలిసిందే!

## పంచముఖ లింగేశ్వరునికి అభిషేకం



నెల్లూరు ఫత్తేఖాన్ పేటలోని బైరాగి మఠం శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 23న రత్నశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచముఖ లింగేశ్వరునికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. శ్రీవిద్యోపాసకుడు మండే లక్ష్మీ నరశింహారావుతో సామూహిక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. ప్రముఖ కళాకారుడు తిరుమలశెట్టి చంద్ర రూపొందించిన పంచముఖ లింగేశ్వరుడికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ నూనె మల్లిఖార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో సినీ సందడి



నెల్లూరులో 90 ఎంఎల్ చిత్ర బృందం సందడి చేసింది. చిత్రం ముందస్తు ప్రచారంలో భాగంగా ఈనెల 23 న నెల్లూరులోని కృష్ణ చైతన్య కళాశాలలో విద్యార్థులతో హీరో, హీరోయిన్‌లు కార్తికేయ, నేహా ముచ్చటించారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డి, డీన్ సుధారాణి, ప్రిన్సిపల్ నాగయ్య స్వాగతం పలికి హీరోహీరోయిన్లను సన్మానించారు.

## హాకీ ఆటకు పెద్దపీట!

మన జాతీయ క్రీడ హాకీకి పూర్వవైభవం తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పాడు. ఆదివారం నెల్లూరులోని హోటల్ డిఆర్ ఉత్తమలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమలోని నాలుగు జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ పరిధిలోకి వచ్చాయని, ఈ అసోసియేషన్‌ను ఒలంపిక్ సంఘం కూడా గుర్తించిందన్నారు. ఈ ఆరు జిల్లాలలో గ్రామీణ స్థాయి నుండి హాకీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతర్‌జిల్లాల హాకీ క్లబ్ లీగ్ పోటీలను నిర్వహించడంతో పాటు అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీలను నెల్లూరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరు కూడా ఇటీవల మరణించిన హాకీ క్రీడాకారుడు మిఠాయి గోపాల్ మృతికి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎ.ప్రసన్నకుమార్‌రెడ్డి, కోశాధికారి మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులు అరిగెల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య ద్వారానే.. ఉన్నత స్థానం

**- సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ**



సత్కారాన్నందుకుంటున్న గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, విద్య ద్వారానే ఉన్నతస్థాయి లభిస్తుందని గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఈనెల 23న నెల్లూరు విఆర్ కళాశాలలో జరిగిన 'ప్రేరణ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునేందుకు నేడెన్నో అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదివి సమాజంలో సమున్నత స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన తాను ఎంతో కష్టపడి చదువుకోవడం వల్లనే ఈ స్థాయికి వచ్చానన్నారు.

ఈ కార్యక్రమంలో విఆర్‌సి ప్రిన్సిపాల్ డా. బాబర్‌ఆలీ మొహిద్దీన్, విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం.సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమయపాలన పాటించాలని, పట్టుదలతో క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు సబ్‌కలెక్టర్ బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను విఆర్‌సి సిబ్బంది ఘనంగా సన్మానించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రబాబు, లైబ్రేరియన్ డా.ప్రభాకర్, కె.శ్రీనివాసులు, డా. టివి రవీంద్రరెడ్డి, డా.కృష్ణకిశోర్, డా. అనిత, శ్రీవాణి, కె.వర్ల్డీ పద్మావతి పాల్గొన్నారు.

## రిజర్వేషన్ కౌంటర్ మారింది

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పడమర వైపున్న రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌ను అదే వైపున ఉన్న టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్దకు మార్చారు. ప్రస్తుతమున్న రిజర్వేషన్ కౌంటర్ భవనాన్ని ఐఆర్‌సిటిసి విభాగానికి అప్పగించారు. రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి చర్యల్లో భాగంగా ఇప్పటివరకు ఉన్న రిజర్వేషన్ భవనాన్ని అన్ని హంగులతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసేందుకు రూపొందించనున్నారు. తూర్పు వైపున వున్న రిజర్వేషన్ కౌంటర్‌లో ఎటువంటి మార్పు లేదు.

### వచ్చే బడ్జెట్‌లోనైనా...

# వెలుగొండకు మోక్షమొచ్చేనా?



## ఉదయగిరికి ప్రాణం ఈ ప్రాజెక్టే!

వెలుగొండ రిజర్వాయర్.. స్వర్గీయ వై.యస్.రాజశేఖరరెడ్డి స్వప్నం. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు జలవరం వెలుగొండ. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి, మార్కాపురం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలతో పాటు నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి ప్రాంతవాసుల సాగునీటి, త్రాగునీటి సమస్యలు కూడా తీరుతాయి. వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో దాదాపుగా 70శాతం పనులు జరిగాయి. కొంత మేరకు సొరంగమార్గం పని, ఇంకొన్ని చోట్ల కాలువల తవ్వకాలు మిగిలివున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వెలుగొండ పని అంగుళం కూడా ముందుకు కదల్లేదు. అప్పట్లో సీఎంగా వున్న చంద్రబాబు డెల్టా ప్రాంతమైన కృష్ణా, గోదావరి జిల్లాల్లో పట్టిసీమ, పురుషోత్తమపట్నం వంటి ప్రాజెక్టులపై చూపిన శ్రద్ధలో పావు వంతు ఈ ప్రాజెక్ట్‌పై చూపున్నా ఈ పాటికి ఒక కొలిక్కి వచ్చుండేది. తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేయబట్టే అప్పుడు ఒంగోలు ఎంపీగా వున్న వై.వి.సుబ్బారెడ్డి కూడా వెలుగొండను పూర్తి చేయాలని కోరుతూ ఒంగోలు నుండి వెలుగొండ దాకా పాదయాత్ర చేపట్టాడు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మెట్టప్రాంతాలలో వున్న పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. వెలుగొండను ప్రాధాన్యత ప్రాజెక్ట్‌లలో చేర్చింది. 2020 మార్చిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తికి నిధులు కేటాయించే అవకాశాలు వున్నాయి. ఇరిగేషన్ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ కూడా రాష్ట్రవ్యాప్తంగా పర్యటన చేపట్టి పెండింగ్‌లో వున్న ప్రాజెక్ట్‌లను పరిశీలించి, ఏ ప్రాజెక్ట్‌ను ముందు పూర్తిచేయాలి, వాటికి ఎంత బడ్జెట్ కేటాయించాలన్నదానిపై కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే బడ్జెట్‌లో వెలుగొండకు నిధులు విడుదలై, ఆ ప్రాజెక్ట్ పూర్తయితే ఉదయగిరి వాసుల నీళ్ళ కష్టాలు చాలావరకు తీరినట్లే!

### విద్యుత్ ఒప్పందాల కొరత కారణంగా..

# మూతపడుతున్న ప్లాంట్లు

## - పార్లమెంటులో విపిఆర్



బొగ్గు అనుసంధానాలు మరియు విద్యుత్ ఒప్పందాల కొరత కారణంగా పలు విద్యుత్ ప్లాంట్లు పనిలేకుండా మూత పడుతున్నాయన్న విషయాన్ని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్య సభలో లేవనెత్తారు. 25వ తేదీన ఆయన రాజ్యసభలో జరిగిన చర్చలో మాట్లాడుతూ కోల్ ఇండియా లిమిటెడ్ విద్యుత్ కొను గోలు ఒప్పందాల ద్వారా అలా పని లేకుండా పడివున్న విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు గనులను వేలం వేయడం వంటి వాటిపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆయన కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ప్రశ్నించాడు. దీనికి కేంద్రమంత్రి సమాధానమిస్తూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకారం మన దేశంలో 10 జిడబ్ల్యు బొగ్గు అథా రిటి విద్యుత్ సామర్థ్యం ప్లాంట్లు బొగ్గు అనుసంధానం కలిగిలేవని, ప్రస్తుతం శక్తి పాలసీ 2017 మరియు దాని సవరణ క్రింద నిర్వహించబడుతాయని వివరిం చారు. ఈ విధానంలో పిపిఏ వున్నా లేకపోయినా వివిధ వర్గాల బొగ్గు అను సంధానాలను అనుమతించే నిబంధనలు వున్నాయని చెప్పాడు.

అదేవిధంగా 2025 నుండి ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను అనుమతించడానికి, 2023 నుండి ఎలక్ట్రిక్ త్రిచక్రవాహనాలను అనుమతించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందన్నది వాస్తవమా? కాదా? ఇలా అయితే వాహన తయారీ దారులకు ఏవైనా సబ్సిడీ ప్రోత్సాహకాలు న్నాయా అని ఆయన కేంద్ర భారీ పరిశ్ర మల శాఖ మంత్రి ప్రకాష్‌జవదేకర్‌ను ప్రశ్నించాడు. దీనికి మంత్రి స్పందిస్తూ ఇలాంటి ప్రతిపాదనలేవీ కేంద్రం పరిశీ లనలో లేవని చెప్పారు. 24వ తేదీ జరి గిన చర్చలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రద్దు చేసుకునే రైల్వే టిక్కెట్లపై జిఎస్టీ విధించ డాన్ని ప్రశ్నించాడు. అలాగే దేశీయ ఫార్మా రంగంపై ఆయన పలు విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాడు. 27వ తేదీ జరిగిన చర్చలో ఆయన నెల్లూరుజిల్లాకు సంబంధించిన ఎల్‌పిజి కనెక్షన్‌లపై ప్రశ్నించాడు.

### వైయస్సార్ నవశకానికి

# సర్వే తప్పనిసరి

## - జాయింట్ కలెక్టర్ వినోద్ కుమార్



వైయస్సార్ నవశకానికి సంబం ధించి రేషన్ కార్డుదారులు వారి గ్రామా లకు తప్పకుండా వెళ్ళి సర్వే చేయించు కోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

ఈనెల 23న నెల్లూరు కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రేషన్ కార్డు ఏ గ్రామంలో వుంటే అక్కడికి వెళ్ళి సర్వే చేయించుకోవాలని సూచించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి అనెక్జర్–2 లో మీ–సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు భరోసాకు సంబంధించి 1,89,595 మంది రైతులకు నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని తెలిపారు.

### సీఎం జగన్ నిర్ణయాలు...

# చరిత్రాత్మకం

## - నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వైయస్ జగన్మోహన్ రెడ్డి పేదప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు చరిత్రాత్మకమైనవని, ముఖ్యంగా పేద విద్యార్థులకు విద్య, వైద్యం విషయంలో ముఖ్య మంత్రి ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారని వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న వాకాడులోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తరించడం, అన్ని జబ్బులకు చికిత్స అందేలా చూడడం, ఇతర రాష్ట్రాల్లోని ఆసుపత్రులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయడం వంటి నిర్ణయాలు బాధితులకు ఎంతో ఉపయోగకరమన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందింపజేసేందుకు తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటుచేయడం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఈ 5నెలల్లోనే 90శాతం పైగానే అమలుచేయడం ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. ఆంగ్లమాధ్యమంపై కొందరు చేస్తున్న విమర్శలు సముచితం కావని అన్నారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లోని రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా స్వర్ణముఖికి 3 టిఎంసిల గంగ నీటిని విడుదల చేసేందుకు తనతో పాటు ఇక్కడి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఆ మేరకు ప్రభుత్వంతో సంప్రదిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంత రైతులకు ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తామన్నారు. నాయకులు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, తూపిలి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాన్ని ప్రారంభించిన సంజీవయ్య



ఈ నెల 23వ తేదీన సూళ్లూరుపేట మండలం మంగా నెల్లూరు గ్రామంలో గ్రామ సచివాలయంను సూళ్లూరుపేట శాసనసభ్యుడు కిలివేటి సంజీవయ్య ప్రారంభించాడు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దువ్వూరు బాలచంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి, కళత్తూరు రామ్మోహన్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి, దామానెల్లూరు సొసైటీ అధ్యక్షులు కళత్తూరు జనార్ధన్‌రెడ్డి, ఎంపిడిఓ నర్మద, కొండూరు రవిరెడ్డి, దేవేంద్రరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, దామతోటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

# కర్రసాముకు గుర్తింపు తెస్తా!

## - రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పేర్నాటి శ్యామ్



ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి, క్రమశిక్షణ మెండుగా కలిగించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు దోహదం చేసే సిలంబం (కర్రసాము) క్రీడ అభివృద్ధికి తాను అన్నివిధాలా కృషి చేస్తానని, అన్ని క్రీడలతో సమానంగా 'కర్రసాము'కు కూడా క్రీడా రంగంలో మంచి గుర్తింపు వచ్చేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డితో కూడా సంప్రదిస్తామని ఆంధ్ర ప్రదేశ్ అమెచ్యూర్ సిలంబం(కర్రసాము) అసోసి యేషన్‌కు అధ్యక్షునిగా ఎన్నికైన పేర్నాటి శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24న నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న పివిఆర్ కళ్యాణమండపంలో జరిగిన ఏపి రాష్ట్రస్థాయి అమెచ్యూర్ సిలంబం రెఫరీ సెమినార్, వార్షిక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను రాష్ట్ర సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్న రాష్ట్రంలోని 13 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లాస్థాయిలోనే కాకుండా, గ్రామ స్థాయి నుంచి ఈ క్రీడాభివృద్ధికి కోచ్‌లు విద్యార్థు లకు తగు శిక్షణ ఇవ్వాలని ఆయన ఆకాంక్షిం చారు. డిసెంబర్ 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఈ క్రీడకు సంబంధించి స్పోర్ట్స్‌మీట్‌ను నెల్లూరు జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలి పారు. అసోసియేషన్ ఛైర్మెన్ వై.శివరామ కృష్ణ మూర్తి, వైస్‌ఛైర్మెన్ సి.వీరరాజశేఖరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి కె.వెంకటేష్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పి.శంకరనారాయణ పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



### ఆర్‌బిఐ ఆధ్వర్యంలో..

# 'ఫెమా'పై శ్రీసిటీలో సదస్సు



విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్-ఫెమా) కింద విదేశీ మారక నిబంధనలపై అవగాహన పెంచేందుకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), శ్రీసిటీ సంయుక్తంగా ఈనెల 22న శ్రీసిటీలో సదస్సును ఏర్పాటుచేశారు. విదేశీ మారక లావాదేవీలను సరళతరం చేసే ప్రయత్నంలో భాగంగా, ఫెమా చట్టం ప్రకారం వాడుకలో ఉన్న నియమనిబంధనలను పాటించేలా చేయడమే ధ్యేయంగా ఆర్‌బిఐ ప్రజలతో ఇలాంటి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియజేశారు. శ్రీసిటీలోని వివిధ పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రతినిధులు, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్న ఈ సదస్సులో ఆర్‌బిఐ ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ వీరందరికీ స్వాగతం పలికారు. ఈ సదస్సులో ఆర్‌బిఐ (హైదరాబాద్) డిజిఎం శ్రీమతి శైలజారాణి ప్రసంగిస్తూ 'ఫెమా'పై అవగాహన పెంచడానికి, సమస్యలను పరిశీలించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు ఆర్‌బిఐ ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ సదస్సును శ్రీసిటీలో నిర్వహించినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌బిఐ ఏజిఎం కల్యాణచక్రవర్తి, ఏఎంలు రేణుకా బాలకృష్ణన్, ఇ. గణేష్, ఆర్‌బిఐ మేనేజర్ సుధ వెంకట్రామన్ తదితరులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించారు. సుమారు 60 మంది పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతి సెషన్ ముగింపులో ప్రతినిధులు వారి సందేహాలను చర్చించి నివృత్తి చేసుకున్నారు. శ్రీసిటీ సెజ్ అభివృద్ధి కమిషనర్ ఆర్.ముత్తురాజు ఈ సదస్సును ప్రారంభించగా, డెలాయిట్ ఇండియా ప్రతినిధి సెంథిల్‌కుమార్ పర్యవేక్షించారు.

# అంబేద్కర్ ఆశయాలు.. మార్గదర్శకం

**- జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర అధికారుల నివాళి**




భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ ఆశయాలు, ఆయన జీవితం అందరికీ మార్గదర్శకమని జిల్లాకలెక్టర్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న నెల్లూరు లోని విఆర్‌సి సెంటర్‌లో ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి జిల్లా ఉన్నతాధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి చదువుకుని, రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన మహామనీషి డా. అంబేద్కర్ అని కొనియాడారు. జేసీ వినోద్‌కుమార్, జేసీ-2 కమలకుమారి, డిఆర్‌ఓ మల్లికార్జున, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, సాంఘికసంక్షేమ శాఖ అధికారి జీవపుత్రకుమార్, ఐటిడిఏ పి.ఓ మణికుమార్, కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి పాల్గొన్నారు.

అదేవిధంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు కార్యాలయంలోనూ భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకగా నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.మనోహర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వీరభద్రుడు, అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, డిఎస్పీలు కోటారెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణముఖికి తెలుగుగంగ జలాలు

గూడూరు నియోజకవర్గానికి తెలుగుగంగ కాలువ ద్వారా వచ్చే నీటిని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు ఈనెల 25న తెలుగుగంగ అధికారులతో కలసి పరిశీలించారు. వెంకటగిరి ప్రాంతంలోని రాంబొట్లపల్లి వద్ద ఉన్న తెలుగు గంగ కాలువను పరిశీలించి ఎంత సామర్థ్యంతో నీరు విడుదలవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజ్‌కి 300 క్యూసెక్కుల తెలుగుగంగ జలాలను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని సాగునీరు, తాగునీటి అవసరాలకు తెలుగుగంగ కాలువ ద్వారా నీరు చెరువులకు చేరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వాకాడు సహకారసంఘం అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, వైకాపా నాయకులు, పలువురు అధికారులు ఉన్నారు.



తెలుగుగంగ కాలువ వద్ద అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

### 'భవిత' కేంద్రాలను

## సద్వినియోగం చేసుకోవాలి

భవిత కేంద్రాల ద్వారా మానసిక దివ్యాంగులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ మధుసూదనరావు అన్నారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఫిజియోథెరపీపై దివ్యాంగుల తల్లిదండ్రులకు ఈనెల 26న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవూఫ్ భవిత కేంద్రం ఉపాధ్యాయులు అజయ్, మంగమ్మ, ఫిజియోథెరపిస్ట్ పావని తదితరులు పాల్గొన్నారు.

### మాతమ్మల

## సమస్యలను పరిష్కరించాలి

ఎన్నో ఏళ్ళుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలపై అధికారులు స్పందించకపోవడం దారుణమంటూ మాతమ్మలు ఆందోళన బాట పట్టారు. ఈనెల 25న వారు గూడూరులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మలు మాట్లాడుతూ అధికారులు, పాలకులు మారుతున్నారే తప్ప తమ బాధలు మాత్రం తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నివాస స్థలాలను కేటాయించాలని, భూ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఎన్నిసార్లు అధికారులకు తమ గోడు విన్నవించుకుంటున్నా ఫలితం ఉండడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో బిరదవోలు మాతమ్మ, బట్టా మాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

### ప్రభుత్వాసుపత్రుల

# రూపురేఖలు మారేలా కృషి!

**- వైద్య విధాన పరిషత్ కమిషనర్ రామకృష్ణారావు**



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కమిషనర్ రామకృష్ణారావు, పక్కన డాక్టర్ ఉమ

రానున్న ఆరు నెలల్లో రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలను మార్చేలా కృషిచేస్తున్నామని వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ యు.రామకృష్ణారావు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను చర్చించేందుకు చేపట్టిన రెండురోజుల పర్యటనలో భాగంగా ఆయన ఈనెల 25న గూడూరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యసేవలపై రోగులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి డా. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'నాడు-నేడు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వాసుపత్రులను తనిఖీ చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, తదనుగుణంగా ఆరునెలల్లో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన వైద్యసేవలను అందించేలా కృషి చేస్తామని చెప్పారు. ఇక్కడ ప్రధానంగా మౌలిక వసతుల కొరత, ఆసుపత్రి సిబ్బంది తక్కువగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆసుపత్రికి మంజూరైన నిధులతో నూతన భవనం, అధునాతన పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సుబ్బారావు, ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ ఉమ ఉన్నారు.

# క్షేత్రస్థాయిలో బిజెపిని పటిష్టం చేయాలి

భారతీయ జనతాపార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా పటిష్టం చేయాలని, ప్రతి కార్యకర్త, నాయకుడు ఆ దిశగా కృషిచేయాలని బిజెపి ముఖ్యనాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 26న నెల్లూరులో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల జోనల్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి జాతీయ మహిళా మోర్చా ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి, మాజీమంత్రి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడికొండల మాణిక్యాలరావు పాల్గొని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బూత్‌స్థాయి, మండల స్థాయి పార్టీ కమిటీలను పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ జీవితచరిత్రను తెలియజేస్తూ, డా. అంబేద్కర్ ఆశయాల సాధనకు బిజెపి చేస్తున్న కృషిని వివరించారు. బిజెపి జిల్లా ఇన్‌చార్జి సైదారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయుడు, కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ నిర్మాతకు నివాళులు



డా. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో డా. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భగవంతుని మాటే.. భగవద్గీత

- డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు



సత్కారాన్నందుకుంటున్న చీమకుర్తి వేంకటేశ్వరరావు

త్రేతాయుగంలో భగవంతుడు రామావతారంలో మాయా మానుష విగ్రహునిగా అవతరిస్తే, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడుగా లీలా మానుష రూపంలో ఉద్భవించాడని, భగవంతుని అవతారాలు ఎన్నున్నా అవన్నీ ఆ భగవంతుని అంశలే అయితే శ్రీకృష్ణ భగవానుడు మాత్రం స్వయంగా భగవంతుడేనని డికెడబ్ల్యు కళాశాల విశ్రాంత ఆంధ్రశాఖాధ్యక్షులు డా. చీమకుర్తి వేంకటేశ్వర రావు అన్నారు. ఈనెల 24న నెల్లూరు లోని వర్ధమాన సమాజం, శ్రీ బత్తిన చంద్రశేఖర్‌రెడ్డి స్మారకనిధి (నిడిముసలి) సంయుక్త ఆధ్వర్యంలో టౌన్‌హాలులోని జూ.రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారకభవనంలో మహాకవి పోతన జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన 'పోతన-శ్రీకృష్ణతత్వం' అనే అంశంపై ప్రసంగించారు. భగవత్ భక్తిని, భగవత్ శక్తిని చాటేదే ఆ పరమాత్మ తత్వమని, అందరూ భగవత్‌సేవలో తమ జీవితాలను ధన్యం చేసుకోవాలని అన్నారు. సాక్షాత్తూ భగవంతుడైన ఆ శ్రీకృష్ణ పరమాత్మ పలికిన మాటే భగవద్గీత అని, ఆయన చేష్టలే భాగవతమని, ఆ దివ్యమైన వేణునాదమే సకల చరాచర ప్రపంచాన్ని మోక్షమార్గంలో నడిపిస్తుందని అన్నారు. అనంతరం బత్తిన చంద్రశేఖర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బత్తిన సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డా.చీమకుర్తిని ఘనంగా సత్కరించారు. అనేకమంది సాహిత్యాభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## 2 నుంచి
# శారీరక సౌష్టవ వారోత్సవాలు

'ఫిట్ ఇండియా' ఉద్యమంలో భాగంగా డిసెంబర్ 2 నుంచి 7వ తేది వరకు జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన ప్రభుత్వపాఠశాలలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో శారీరక సౌష్టవ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డిఇఓ జనార్ధనాచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్ధేశిత రోజుల్లో పాఠశాలల్లో ఉదయం జరిగే అసెంబ్లీ సమయాల్లో విద్యార్థులతో యోగా, వ్యాయామం, గార్డెనింగ్, స్పోర్ట్స్, క్విజ్, సంప్రదాయ, ప్రాంతీయ క్రీడలు నిర్వహించాలని, ప్రతి విద్యార్థికి వార్షిక దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఎంఇఓలు, డివైఇఓలు, ఫిట్ ఇండియా కార్యక్రమాలు విజయవంతం అయ్యేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

# భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు

భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు ఈనెల 23 న నెల్లూరు మూలాపేట శివగిరి కాలనీలో వైభవంగా జరిగాయి. సత్యసాయి యోగా ధ్యానమండలి నిర్వాహకులు, స్టేట్ బ్యాంకు అధికారి నజీర్ బాషా గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాయిభక్తులు, యోగా, ధ్యాన శిక్షకులతో కలిసి ఓం సాయి.. శ్రీసాయి.. జయజయ సాయి.. అంటూ నామస్మరణ చేస్తూ నగర సంకీర్తన చేశారు. చిన్నారులు కోలాటాలు ఆడుతూ సత్యసాయి చిత్రపటంతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. శివగిరి కాలనీ నుంచి ధర్మరాజుస్వామి దేవస్థానం మీదుగా మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం వరకు నగర సంకీర్తన జరిగింది. రామచంద్రమిషన్‌కు చెందిన ఉమా గంగాధర్, పాలిటెక్నిక్ మాజీ ప్రిన్సిపల్ టి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ పోస్టింగుల్లో అన్యాయం

- ఏఎన్‌ఎంల ఫిర్యాదు
- డిఎం అండ్ హెచ్‌ఓపై కలెక్టర్ మండిపాటు

గ్రామ సచివాలయాల ఏఎన్‌ఎంల పోస్టింగ్‌ల విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు ఏఎన్‌ఎంలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధిక మార్కులు వచ్చిన అభ్యర్థులకు పోస్టింగ్‌కు సంబంధించి ఖాళీలు చూపకుండా దూరప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. తక్కువ మార్కులు వచ్చినవారికి మాత్రం దగ్గర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందంటూ పలువురు గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలు ఈనెల 25న కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు వద్ద తమ గోడు వెళ్ళబోసుకున్నారు. వెంటనే రీకౌన్సిలింగ్ జరపాలని కోరారు. అందుకు కలెక్టర్ స్పందించారు. ఇలా ఎందుకు జరిగిందంటూ డిఎంఅండ్‌హెచ్‌ఓపై మండిపడ్డారు. అసలు ఈ పోస్టింగ్ ప్రక్రియను ఎలా చేపట్టారో తనకు వెంటనే వివరాలు అందజేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## అన్ని ఆరోగ్యకేంద్రాల్లో..
# మే నెలాఖరుకల్లా ఖాళీల భర్తీ

రాష్ట్రంలోని 175 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని అన్ని విభాగాల్లో ఉన్న ఖాళీలను వచ్చే ఏడాది మే ఆఖరు నాటికి భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ రామకృష్ణారావు చెప్పారు. ఈనెల 25న ఆయన జిల్లాలోని నాయుడుపేట ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని విధాలా తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఆరోగ్యకేంద్రాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు, మౌలిక సదుపాయాలను కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్‌తో పాటు డిసిహెచ్‌ఎస్ సుబ్బారావు, నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి హరిప్రియ తదితరులున్నారు.

# పట్టాయ బీచ్‌లో రాహుల్ ధ్యానం

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్ జనపథ్... కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో పాటు అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, మనీష్ తివారి, కపిల్‌సిబల్, మల్లిఖార్జున ఖర్గే, ఆనంద్‌శర్మ, ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్ వున్నారు. వారంతా ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లుగా వుంది. అంతలో అక్కడ ఒక కారు ఆగింది. అందులో నుండి శివసేన అధినేత ఉద్ధవ్ ధాకరే తన సతీమణితో కలిసి దిగాడు. సోనియాగాంధీ టీమ్ వారికి ఎదురేగి ఘనంగా స్వాగతం పలికింది. అందరూ హాల్‌లో కూర్చున్నారు. అప్పుడే విహెచ్ హనుమంతరావు ఆధ్వర్యంలో సర్వర్‌లు అందరికీ స్నాక్స్, కాఫీలు అందించారు. సోనియా వుండి ఉద్ధవ్‌తో... మీ తండ్రి ఎంతో మహానుభావుడు, గొప్ప లౌకికవాది, ఆయన భావజాలం మాకు ఎంతగానో నచ్చేది, ఆయనుండగా, ఆయనతో కలిసి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు భావించాం, అయినా కాలం కలిసిరాలేదు. ఇంత కాలానికి ఆ అవకాశం వచ్చింది. మా మద్దతుతో మీరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయండి... మిమ్మల్ని సీఎం సీటులో చూసి మురిసిపోవాలన్నది నా కోరిక అని చెప్పి ఉద్ధవ్ వైపు చూసింది. అంతే, ఆమె షాకయ్యింది. ఉద్ధవ్ ధాకరే కంట్లో ధారాపాతంగా కన్నీళ్లు... ఎందుకేడుస్తున్నావ్ ఉద్ధవ్, నేనేమన్నా తప్పుగా మాట్లాడానా అని సోనియా అడిగింది. లేదు మేడమ్, నాపై మీరు చూపించిన అభిమానం ఉధృతికి ఈ కన్నీళ్లొస్తున్నాయి. నాపై ఇంత ప్రేమ మా అమ్మా, నాన్నలు కూడా చూపించలేదు. అన్నేళ్లు రాజకీయాలలో వున్నా మా నాయన కూడా నన్నెప్పుడూ సీఎం సీట్లో చూడాలనుకోలేదు. ఇప్పుడు మీరు చూపిస్తున్నారు చూడండి మేడమ్ ఇదీ ప్రేమ... దానికి ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేమని అన్నాడు. శరద్‌పవార్ వుండి.... ఈరోజే గవర్నర్‌ను కలిసి మేం మద్దతు లేఖలు అందజేస్తాం, రేపో ఎల్లుండో ప్రమాణస్వీకారం పెట్టుకోండి అని చెప్పాడు. అందుకు ఉద్ధవ్... నా ప్రమాణస్వీకారానికి రాహుల్ బాబు రావాలి, ఆయన ఎప్పుడొస్తే నాకు అప్పుడే మంచిరోజు. ఇంతకూ ఆయన ఎక్కడకు వెళ్లాడు అని ఉద్ధవ్ అడిగాడు. దానికి సోనియా... రాహుల్ రావడం కుదరకపోవచ్చు... ఆయన మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేసుకోవడానికి విదేశాలకు వెళ్లాడు అని చెప్పింది. పక్కనేవున్న శివసేన ఎంపి సంజయ్‌రౌతు... అదేంటి మేడమ్, ప్రపంచంలో వున్న అన్ని దేశాల వాళ్ళు మానసిక ప్రశాంతత కోసం, ధ్యానం చేసుకోవడం కోసం మన దేశానికి వస్తారు, మరి ధ్యానం చేయడానికి రాహుల్ విదేశాలకు వెళ్లడమేంటి? చైనాలో వున్న మానససరోవర్‌కు వెళ్లాడా? అని అడిగాడు. వెంటనే అహ్మద్ పటేల్ అందుకుని... చైనాకు కాదు, థాయ్‌లాండ్ వెళ్లాడు. గత రెండు వారాలుగా అక్కడే ధ్యానం చేస్తున్నాడు అని చెప్పాడు. 'థాయ్‌లాండ్' అనగానే ఉద్ధవ్‌ధాకరే, సుజయ్‌రౌతులు ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టి... అదేంటి మేడమ్, నిజంగా ధ్యానం చేయడానికే రాహుల్ ఆ దేశానికి వెళ్లాడా, మీకు అలా చెప్పారా అని అడిగాడు. సోనియా వుండి... నిజంగా అక్కడికెళ్లి ధ్యానంలో మునిగిపోయివున్నాడు... కావాలంటే చూడండి అంటూ తన సెల్ ఫోన్‌లో థాయ్‌ల్యాండ్ నుండి రాహుల్ పంపిన ఒక వీడియోను ఓపెన్ చేసింది.

బ్యాంకాక్ సమీపంలోని అటవీ ప్రాంతం... బోధి చెట్టుక్రింద రాహుల్ గాంధీ కూర్చుని వున్నాడు. ఆయన పూర్తిగా కాషాయ వస్త్రాలు ధరించి వున్నాడు. థాయ్‌ల్యాండ్‌కే చెందిన నలుగురు సన్యాసినులు ఆయనకు నాలుగు వైపులా కూర్చుని తలా ఒక విసనకర్రతో విసురుతున్నారు. ఆయన మాత్రం తపోదీక్షలో మునిగిపోయి వున్నాడు. ఆయన నోటి నుండి 'ఓం నమఃశివాయ' మంత్రమే వస్తోంది. ఆయనకు చుట్టుపక్కల పులులు, సింహాలు తిరుగుతున్నాయి. కొన్ని పులులైతే ఆయన ముందు సాగిలపడి నమస్కరించి వెళ్లిపోతున్నాయి. కొద్దిసేపటికి ఒక బౌద్ధగురువు దండోర్ లామా అక్కడకు వచ్చాడు. సన్యాసినులతో ఆయన వుండి... ధ్యానముద్రలో వున్న రాహుల్ మధ్యలో బ్రేక్ తీసుకున్నారా? అని ప్రశ్నించాడు. దానికి ఓ సన్యాసిని వుండి... లేదు స్వామి... ఆయన వారంరోజుల నుండి నాన్‌స్టాప్‌గా దీక్షలోనే వున్నాడు, ఆఖరకు కళ్లు తెరచి మమ్మల్ని కూడా చూడడం లేదు. అంత నిష్ఠగా ధ్యానం చేస్తున్నారని చెప్పింది. వెరీగుడ్, ఇలా ఆయన నిష్ఠగా ధ్యానం చేయగలిగితే భారతదేశ రాజకీయాలలో రాణించగలుగుతాడు, భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన 18గంటల నిరవధిక ధ్యానం రికార్డును అవలీలగా బ్రేక్ చేయగలుగుతాడు, జయీభవ అంటూ ఆ గురువు అక్కడనుండి ముందుకు కదిలాడు. ఇక్కడితో ఆ వీడియో అయిపోయింది. చూశారా, మా రాహుల్ ఎంత క్రమశిక్షణగా ధ్యానం చేస్తున్నాడో... ఇంత కఠినంగా క్రమశిక్షణగా వుంటే ఈ దేశానికి ప్రధాని కాకుండా వుంటాడా? ఆ వీడియో చూశాక మీకేమనిపిస్తోంది అని సోనియా అడిగింది. దానికి ఉద్ధవ్ ధాకరే... బాహుబలి పార్ట్-1, పార్ట్-2లను మిక్స్ చేసి చూసినట్లనిపిస్తుందన్నాడు. ఆ మాట అనేటప్పుడు అక్కడే విహెచ్ హనుమంతురావు ట్రేలో ప్లేట్లు పెట్టుకొని వున్నాడు. ఆ మాట వినడంతోనే ఆయన కోపంతో వూగిపోతూ వాటిని దభీమని క్రిందేశాడు. నేరుగా ఉద్ధవ్‌ధాకరే వద్దకొచ్చి... అంటే మీ ఉద్దేశ్యమేంటి... ఆ వీడియో నిజం కాదంటారా? అంతా గ్రాఫిక్స్ అంటారా? అందులో సీన్‌లు ఫ్యాబ్రికేటెడ్ అని అనుమానిస్తున్నారా? మా రాహుల్‌బాబు ఎవరో దీక్ష చేసుకునే మునికి తన తలకాయ అంటించి గ్రాఫిక్ డిజైన్‌చేసి ఈ వీడియో తయారు చేసి పంపించారంటారా... సోనియమ్మకు ఈ వీడియో పంపించి, ఆయన మాత్రం బ్యాంకాక్ నైట్‌క్లబ్‌లలో, పట్టాయ బీచ్‌లలో అమ్మాయిలతో తిరుగుతూ, మసాజ్‌లు చేయించుకుంటున్నాడని అంటారా? అసలు ఆయనను అనుమానించడానికి మీకు మనసు ఎలా వచ్చిందని ఆవేశంగా అడిగాడు. దానికి సోనియా కోపంగా... హనుమాన్‌జీ ఇక ఆపు... ఈ అనుమానాలన్నీ వాళ్ళకున్నాయో లేదోగాని నీకున్నట్లున్నాయి, అనవసరంగా బంగారం లాంటి ప్లేట్లు పగులగొట్టావ్, ఇక లోపల కెళ్లు అని కసిరింది. తర్వాత ఉద్ధవ్‌తో... మీరెళ్లి ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చేసుకోండి అని చెబుతుండగా... ఆనంద్ శర్మ 'హాచ్' అంటూ తుమ్మాడు. అప్పుడే శరద్‌పవార్ ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. ఆయన ఏంటా అని చూశాడు. అంతే షాక్... తన అన్నకొడుకు అజిత్ పవార్ తిరుగుబాటు... తన వర్గం ఎమ్మెల్యేలతో బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటన.... ఆ మెసేజ్ చదివి పవార్‌కు మతిపోయినంతపనైంది. వెంటనే అక్కడే వున్న రిమోట్ తీసుకుని టీవీ ఆన్‌చేసి 'రిపబ్లిక్' ఛానల్ పెట్టాడు. స్క్రీన్‌పై 'మారిన సీన్‌లు... మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు, సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంగా అజిత్‌పవార్... ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీని ఆహ్వానించిన గవర్నర్"... హెడ్‌లైన్స్... వీటిని చూసి సోనియా నిర్ఘాంతపోయింది. ఆమె కోపంతో షిట్ షిట్... ఛాన్స్ మిస్సయ్యింది అని అనసాగింది. గులాంనబీ ఆజాద్ ఆమెతో... సీఎం ఛాన్స్ మిస్సయ్యింది ఉద్ధవ్‌ధాకరేకి కదా మేడమ్... మీరెందుకు అంత బాధపడుతున్నారని అడిగాడు. దానికి సోనియా... వీళ్ల తండ్రి బాల్ ధాకరే నన్ను ఇటలీ కాంగ్రెస్ అని అవమానించారు... దానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నా... మన మద్దతుతో ఉద్ధవ్‌ను సీఎంగా చేసి, కర్నాటకలో కుమారస్వామికి లాగే ఇతనిపైనా కసి తీర్చుకోవాలనుకున్నాను. సీఎం కుర్చీని అతనికి ముళ్లకుర్చీగా మార్చాలని ప్లాన్ చేశా... ఆ బీజేపీవాళ్ళు నా ఆశలు అడియాశలు చేశారు... అని ఊగిపోతూ చెప్పింది. అంతలో అక్కడకు అజిత్ పవార్ పరుగెత్తుకుంటూ వచ్చి, శరద్ పవార్ కాళ్ళ మీద పడి... నన్ను క్షమించు బాబాయ్, పొరపాటు చేశాను, నీతోనే వుంటాను అని చెప్పాడు. అప్పుడు సోనియా... అబ్బా, పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లయ్యింది అని ఉద్ధవ్ వైపు తిరిగి... నువ్వు తొందరగా సీఎంగా ప్రమాణస్వీకారం చెయ్... మేం ప్రభుత్వాన్ని పడగొట్టే ఏర్పాట్లు మొదలుపెట్టాలని అంది. సోనియా నోట వచ్చిన ఆ మాటలు విని ఉద్ధవ్‌ధాకరే, సంజయ్‌లు అలాగే స్టన్‌అయ్యారు.

# కల్యాణ వైభవం...!




నెల్లూరు నగరంలో డాక్యుమెంట్ రైటర్‌గా సుపరిచితుడైన పంచాగ్నుల పవన్‌కుమార్ సోదరుడు **ప్రవీణ్ - రూప కృష్ణ** (హైదరాబాద్ వాస్తవ్యులు వేటూరి రత్న భాస్కరకృష్ణ - కనకదుర్గాంబల కుమార్తె)ల వివాహం ఈ నెల 21వ తేదీ తిరుమలలోని వైఖానస ఆశ్రమము మ్యారేజ్ హాల్‌లో జరిగింది. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.

# ముగిసిన కార్తీక పూజలు

## • దీపకాంతులతో దేదీప్యమానమైన ఆలయాలు

*శివకేశవారాధనకు ఎంతో ప్రసిద్ధమైన కార్తీకమాసం ఈనెల **26**తో ముగిసింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా అనేక ఆలయాలు కార్తీకదీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి. శివపార్వతుల కల్యాణాలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాసుని కల్యాణోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. అనేకచోట్ల స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నాభిషేకాలు, చండీహోమాలు, జలహారతులు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళలు ఆలయాలకు విచ్చేసి పరమేశ్వరునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లాలోని ఆలయాలన్నీ కార్తీకదీప కాంతులతో కళకళలాడాయి. శివనామ స్మరణలతో ఆలయాలు మార్మోగాయి. పలుప్రాంతాల్లో కార్తీక వనభోజనాలు సందడిగా జరిగాయి.*



కార్తీకమాసం.. జిల్లాకు ఆధ్యాత్మిక శోభను తెచ్చింది. కార్తీక దీపారాధనలతో జిల్లా ప్రకాశమానమైంది. జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో విశిష్టపూజలు నిర్వహించి కార్తీకదీపాలు వెలిగించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని కోటితీర్థంలో మంత్రి గౌతమ్‌రెడ్డి కార్తీకదీపోత్సవం ప్రారంభించారు. వెంకటగిరిలోని కాశీవిశ్వనాధుని ఆలయం ఈ మాసమంతా కార్తీక దీపజ్యోతులతో కాంతులు వెదజల్లింది. మైపాడులోని భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలోనూ, సైదాపురంలోని సిద్ధలయ్యకోనలోని ఆలయంలోనూ విశేష పూజలు, శివపార్వతుల కల్యాణం, శ్రీనివాసకల్యాణం ఎంతో వేడుకగా నిర్వహించారు. పెద్దచెరుకూరులోని బాలాత్రిపురసుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు.

నెల్లూరు నగరంలోని అనేక ఆలయాలు కార్తీక దీపాల వెలుగులతో తేజరిల్లాయి. పరమశివునికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సౌజన్యంతో ఈ నెల 15 నుంచి 17వ తేది వరకు మూడురోజుల పాటు కార్తీక లక్షదీపోత్సవం కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో వేలాదిమంది భక్తులు పాల్గొని కార్తీకదీపాలు వెలిగించారు.



అదేవిధంగా, నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో శ్రీశైలం ఆలయ మాజీ ధర్మకర్త ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 26వ తేది వరకు జరిగిన శివమాల దీక్షల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ శివదీక్ష మాలధారణ భక్తులతో కలసి ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ముక్కాల ద్వారకానాథ్ తదితరులు కార్తీకపూజలు నిర్వహించారు. శివకేశవ లక్షదీపోత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 17న పెద్దఎత్తున కార్తీకదీపాలు వెలిగించి స్వామి వార్లకు విశిష్టపూజలు చేశారు. కార్తీకమాసం చివరిరోజున అమావాస్య, మంగళవారం కలసిరావడంతో పలు ఆలయాల్లో పంచాక్షరి పఠనం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అన్నాభిషేకాలు, చండీహోమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అనేకచోట్ల ముఖ్యంగా.. నదులు, సాగరతీరాలు, చెరువులు, కోనేరుల్లో పరమశివునికి భక్తితో కార్తీక జలహారతులు కూడా సమర్పించుకున్నారు.

### గ్రామ సచివాలయాలు...

# వేగవంతంగా ప్రజల వద్దకు పాలన

గ్రామ సచివాలయాల వ్యవస్థలో ప్రజాసమస్యలు వేగవంతంగా పరిష్కారమవుతాయని ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నాడు. ఈ నెల 24వ తేదీ వింజమూరులోని కొత్తూరులో పారిశ్రామికవేత్త ఇనగనూరి మోహన్‌రెడ్డి విరాళంగా ఇచ్చిన 35లక్షల విలువచేసే 25సెంట్ల స్థలంలో సచివాలయం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశాడు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి నాలుగు, ఐదు వేల మంది ప్రజలకు ఒక సచివాలయం ఏర్పాటవుతుందని, ఒక్క వింజమూరులోనే ఐదు సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పాడు. సచివాలయాల వ్యవస్థ ద్వారా స్థానికంగానూ ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నాడు. మెట్టప్రాంతమైన ఉదయగిరిలో విద్యాభివృద్ధికి తమ సోదరుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశాడని, కృష్ణాపురంలో జవహర్ నవోదయ విద్యాలయం తెచ్చామని, ఉదయగిరిలో ఇంజనీరింగ్ కాలేజీని స్థాపించి నష్టం వస్తున్నా నడుపుతున్నామని చెప్పాడు. సచివాలయం స్థల దాత ఇనగనూరి మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీని స్థాపించి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాడని, ఆయన్ను ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపాడు. ఈ సందర్భంగా వింజమూరు ఎర్రబల్లిపాలెంలో కూడా ఏర్పాటు చేయనున్న సచివాలయంకు ఎమ్మెల్యే భూమి పూజ చేశాడు.



సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

ఈ కార్యక్రమాలలో స్థలం దాత ఇనగనూరి మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, భీమిరెడ్డి రామిరెడ్డి, వైవిరెడ్డి, బి.సుబ్బారావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, యల్లాల రాఘవరెడ్డి, రేవునూరు కొండారెడ్డి, స్థానికులు డాక్టర్ మాశిలామణి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, గణపం చెన్నారెడ్డి, పల్లాల కొండారెడ్డి, మద్దూరు చిన్నకృష్ణారెడ్డి, కొంకల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘరానా మోసగాడి అరెస్ట్

## • మంత్రి గౌతంరెడ్డి పి.ఏనంటూ వంశీ ఛీటింగ్



విలేకర్లకు వివరాలను వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

ఈ సమాజంలో ధర్మ మార్గంలో బ్రతికేవాడికంటే అధర్మ మార్గాన్ని అనుసరించేవాడే జల్సాగా వుంటున్నాడు. లగ్జరీ కార్లు, వంటి మీద ఖద్దరు గుడ్డలు, బంగారు ఆభరణాలు, ఫోన్ ఎత్తితే అవతల మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు డాంబికాలు... జనాలు ఇలాంటి వారినే నమ్ముతుంటారు. తమ సమస్యలను వాళ్ళయితేనే ఉద్ధరిస్తారని చెప్పి లక్షల రూపాయలు ముట్టజెబుతుంటారు. ఇలా ఐటి మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పి.ఏనని చెప్పుకుంటూ జిల్లాలో కోటిరూపాయలకుపైగా మోసాలకు పాల్పడిన టిపిగూడూరు మండలం ఈదూరు గ్రామానికి చెందిన గుండాల వంశీకృష్ణారెడ్డిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ నెల 27వ తేదీన అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకులు, సీనియర్ అధికారుల పి.ఏనని చెప్పుకుంటూ వంశీకృష్ణారెడ్డి గతంలో పలువురి వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేశాడు. ఇటీవలకాలంలో మంత్రి గౌతంరెడ్డి పి.ఏనని చెప్పుకుంటూ మైనింగ్ లీజులిప్పిస్తానని, కాంట్రాక్టులు ఇప్పిస్తానని చెప్పుకుంటూ డబ్బులు దండసాగాడు. ఈ విషయం మంత్రి గౌతంరెడ్డి ఒరిజినల్ పి.ఏ ఊరిబిండి మనోహర్‌రెడ్డికి తెలిసింది. ఆయన ఈ నెల 26వ తేదీన వేదాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో వంశీకృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ ఐశ్వర్య రస్తోగి వెంటనే నిందితుడిని పట్టుకోవడానికి టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించాడు. 24గంటల్లోనే వాళ్ళు నిందితుడిని పట్టుకుని ఒక కారు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కాగా, పోలీసు విచారణలో నిందితుడి గురించి నిర్ఘాంత పరిచే ఇంకొన్ని నిజాలు బయటపడ్డాయి. నిందితుడిపై ఇక్కడేకాక తెలంగాణలోనూ పలు కేసులున్నాయి. ఒక వ్యక్తిని హత్యచేసిన కేసుతో పాటు లైంగిక వేధింపుల కేసు, అత్యాచారం కేసు, కిడ్నాప్ కేసు, పెద్దనోట్ల మార్పిడి కేసులు కూడా వున్నాయి.

# డా. జగదీష్‌కు సివి రామన్ అవార్డు ప్రదానం

ప్రముఖ ప్రత్యామ్నాయ ఇంధనవనరుల శాస్త్రవేత్త, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ డైరెక్టర్ డా. ఏ.జగదీష్‌కు ప్రతిష్టాత్మకమైన సర్ సి.వి.రామన్ మెమోరియల్ అవార్డును అందజేశారు. ఈ నెల 28న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం మరియు అమరావతిలోని ఎ.పి అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారు సంయుక్తంగా శ్రీకాకుళంలో నిర్వహించిన ఎ.పి.సైన్స్‌కాంగ్రెస్-2019 కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నాడు. రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.



అవార్డునందుకుంటున్న డాక్టర్ జగదీష్

స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, ధర్మాన కృష్ణదాస్, కొడాలి నానిలు విశిష్ఠ అతిథులుగా, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ మానవాళికి శాస్త్ర సాంకేతిక రంగాలలోని పరిశోధనలు ఎంతో ఉపకరిస్తున్నాయని, సామాన్య మానవునికి కూడా ఈ ఫలితాలు చేరువకావాలని ఆకాంక్షించారు.

## జాతీయ వాలీబాల్ పోటీలకు వెంకటేష్

విడవలూరు మండలంలోని రామ తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువు కుంటున్న కుల్లంగారి వెంకటేష్ వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి వాలీ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో అండర్-17 విభాగం వాలీబాల్ పోటీల్లో వెంకటేష్ ప్రతిభ కనపరచి, డిసెంబర్ 6,7, 8 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

## షోరూంలోనే నెంబర్ ప్లేట్లు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ ఎం.ఎస్.నెం.48 ప్రకారం కొత్త వాహనాల నెంబర్ ప్లేట్లను ఇకనుండి వాహనాల షోరూంలలోనే బిగించాలని జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్బారావు తెలిపారు. 27వ తేదీ నెల్లూరులోని జిల్లా రవాణా కార్యాలయంలో ఆటోమొబైల్ షోరూంల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేటు అమర్చాకే వాహనాన్ని ఇవ్వాల్సి వుంటుందని, నెంబర్ ప్లేటు ముద్రించడానికి, అమర్చడానికి అయ్యేఖర్చంతా కూడా వాహన ధరలోనే కలిపి వుంటుందని, ఇందుకు సంబంధించి ఎటువంటి అదనపు నగదును వాహన కొనుగోలుదారుని నుండి వసూలు చేయరాదని ఆయన పేర్కొన్నాడు. ఈ నిబంధనలు తక్షణం అమలులోకి వస్తాయని ఆయన వెల్లడించాడు.

ఈ సమావేశంలో రవాణాశాఖ కార్యాలయ పరిపాలనాధికారులు ఎం.డి.మదాని, కె.శ్రీహరి కూడా పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు మాల్యాద్రికి సత్కారం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుండి నవంబర్ 26 న జరుపుకునే భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో సాంఘికశాస్త్ర దినోత్సవాన్ని జరుపుకోవాలని ఉత్త ర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్రంలో ఉత్తమ సేవలు అందించిన రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి జిల్లాకు ఒకరు చొప్పున సాం ఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఆంధ్ర ప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ద్వారా స్టేట్ లెవల్ బెస్ట్ సోషల్‌స్టడీస్ టీచర్ అవార్డును ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో నెల్లూరు భక్తవత్సలనగర్ కెవిఆర్ మునిసిపల్ నగరపాలక పాఠశాలకు చెందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఆరుమూళ్ళ మాల్యాద్రిని ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగింది. ఇటీవల అమరావతిలోని ఇబ్రహీంపట్నం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఎస్సీఈఆర్టీ ప్రాంగణంలో ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ జి.ప్రతాప్‌రెడ్డి చేతులమీదుగా శాలువ, షీల్డ్, మెడల్‌తో మాల్యాద్రిని సత్కరించారు. ఈ సందర్భంగా కెవిఆర్ పాఠశాల హెచ్ఎం విజయప్రకాష్ రావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మాల్యాద్రిని అభినందించారు.

## నవరత్నాలే తన లక్ష్యాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలో సగం బియ్యం బ్లాక్ మార్కెట్‌కే వెళతాయి, వాటిని పాలిష్ పెట్టి మళ్ళీ అధిక ధరలకు మనకే అమ్ముతున్నారు. ప్రస్తుతం ఈ పథకంలో సద్వినియోగం కంటే దుర్వినియోగమే ఎక్కువ.

దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజ శేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న ఐదేళ్ల కాలంలో ఈ రాష్ట్రంలో చిరస్మరణీయ పథకాలే అమలయ్యాయి. ఆరోగ్యశ్రీ పథకం ఎన్నో ప్రాణాలు నిలబెట్టింది. ఫీజు రీయం బర్స్‌మెంట్ ఎందరికో ఉపాధి అవకాశాల నిచ్చింది. ఉచిత కరెంట్ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచింది, విద్య, వైద్య పరంగాగాని, రైతాంగానికి చేయూతనిచ్చే విధంగా గాని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినా ఇబ్బంది కలగలేదు. కాని, సంక్షేమం పేరుతో జనానికి నేరుగా డబ్బు లివ్వడం వంటి పథకాలతోనే ఆర్థిక వ్యవస్థ కుంగిపోతుంది.

ఈ ఆర్నెల్లలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో కొన్ని జనామోదం పొందగా మరికొన్నింటిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అసలే రాష్ట్ర విభజన తర్వాత ఏపి ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా వుంది. గత ఐదేళ్ళ రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబునాయుడు తన దుబారాతో ఇంకొంత దివాళా తీయిం చాడు. ఎలక్షన్ టైంలో ఓట్ల కోసం పసుపు - కుంకుమ అని 30వేల కోట్లు సర్వ నాశనం చేసి పెట్టాడు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం ఆరోగ్యంగా లేదు. అయినా సీఎం జగన్ రెడ్డి సంక్షేమ పథకాల పరంపర కొనసాగి స్తున్నాడు. రైతులు, వృద్ధులు, వికలాంగు లకు ఆర్థిక సాయం, విద్య, వైద్య పరంగా చేస్తున్న కొన్ని కార్యక్రమాలు చేయాల్సిందే. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు 'అమ్మ ఒడి' వంటి స్కీంను వర్తింప చేయడం, మతపరమైన అంశాలకు ప్రభుత్వం నుండి వేతనాలు ఇవ్వడం, వీటిని అమలు చేయడం కోసం ప్రభుత్వ, దేవాదాయ శాఖ ఆస్తుల జోలికి పోవడం వంటివి వివా దాస్పదమయ్యే అవకాశముంది.

ఎన్నికల్లో హామీ ఇచ్చిన అన్ని పథకా లను ఆరునెలల్లోపే అమలు చేయాల్సిన అవసరం లేదు. ఆరు నెలలకొకటి ప్రాధా న్యతను బట్టి అమలు చేయొచ్చు. నిర్దిష్ట సమయం ప్రకారం విరామం తీసుకుని వాటిని అమలులోకి తెస్తే సక్రమమైన మార్గంలో పెట్టొచ్చు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా వేస్తూ కూడా పథకాలను అమలు చేయాల్సి వుంటుంది. ఓ పక్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుండి, కేంద్ర సహకారం ఎంతమాత్రం లేని తరుణంలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సాగిస్తున్న ఈ సంక్షేమ పథకాల యజ్ఞం పులిమీద స్వారీయే అవుతుంది.

### ఉత్పాతాలే...

రాష్ట్రంలో నవరత్నాలు శరవేగంగా అమలు చేయడం వెనుక ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఉద్దేశ్యాలు, లక్ష్యాలు వేరుగా వున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల లోపు నవరత్నాల ఫలాలు ప్రతి ఇంటి తలుపును తట్టాలన్నది ప్రధాన ఆలోచన. ఆ ఎన్నికల నాటికి ఎన్నికల మేనిఫెస్టోను తు.చ తప్పకుండా అమలు చేసిన ముఖ్యమంత్రిగా ప్రజలలో గుర్తింపు సాధించాలి, ఆ పని తీరుతోనే ప్రజలను ఓట్లడగాలి... మెరుగైన ఫలితాలు సాధిం చాలన్నది ఒక కోణం.

ఇక రెండోది ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో చాలామంది నాయకులను లక్ష్యంగా చేసుకుని ఆడిస్తోంది. వాళ్ళు ఎవరిని టార్గెట్ చేస్తే వాళ్ళు జైళ్లకు పోతు న్నారు. కేంద్రంతో జగన్‌కు ఇప్పటివరకు సన్నిహిత సంబంధాలే వున్నాయి. ఆయన కేంద్రంతో పేచీలు పెట్టుకోవడం లేదు. కాని, జగన్‌ను ఇబ్బందిపెట్టాలని బీజేపీ అధిష్టానం భావిస్తే మాత్రం ముందుగా ఆయన బెయిల్ రద్దు కావచ్చు. ఇదే జరి గితే రాష్ట్రంలో వూహించని రాజకీయ పరి ణామాలు చోటు చేసుకుంటాయి. అలాంటి పరిస్థితులు తలెత్తినా ప్రజానాయకుడిగా తన ఆదరణ తగ్గకూడదు, పార్టీపై, ప్రజల పై తన ముద్ర చెదిరిపోకూడదు... ఈ లక్ష్యం తోనే ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా ఆలోచించకుండా ఎడాపెడా పథ కాలు అమలు చేసుకుంటూ పోతున్నాడు.

ఎవరెన్ని చేసినా ప్రజలు మాత్రం స్వార్థపరులు, ఆశావహులు. ఎంత చేసినా ఇంకా కావాలనే మనస్తత్వం తప్ప సంతృప్తి చెందేరకం కాదు. గతంలోలాగా ఇప్పుడు విలువలులేవు, నైతికతలేదు, అంతా స్వార్థమే. 5సంవత్సరాల 3నెలల కాలంలో డా॥ వైయస్ రాజశేఖరరెడ్డి అందించిన సంక్షేమ పథకాల ఫలాలను పరిపూర్ణంగా అనుభవించి, 2009 సెప్టెంబరులో ఆయన ఆకస్మిక మరణం అనంతరం గుండెలవి సేలా ఏడ్చి గగ్గోలుపెట్టిన జనం 2009లో ఆయనకు తక్కువ మెజారిటీని ఇవ్వడమే కాకుండా 2014లో జగన్‌రెడ్డిని ఓడిం చారు. కేవలం వరాలు కురిపించినంత మాత్రాన ఓట్ల వర్షం కురిపిస్తారనుకోవడం భ్రమే అవుతుంది!

## 'దేశం' ఖాళీ అవుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాను గల్లంతు చేసే దిశగా ఈ పరిణామాలు మారుతున్నాయి. డిసెంబర్ 9వ తేదీ నుండి శాసనసభ శీతాకాల సమావేశాలు మొదలుకానున్నాయి. ఆ సమయానికే చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదా గల్లంతు కావచ్చని విశ్వసనీయంగా తెలుస్తోంది. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపిలోకి భారీ ఎత్తున చేరికలు వుండబోతున్నాయి. ఇప్పటికే గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసేశాడు. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఆ జిల్లాల్లోని ముఖ్యనేతలు కూడా వైసిపిలో చేరడానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు మంతనాలు జరిగిపోయాయని సమాచారం.

అయితే చంద్రబాబులా నీచమైన రాజకీయ ఫిరాయింపులను సీఎం జగన్ ప్రోత్సహించడం లేదు. వైసిపిలోకి రావాలనుకున్న ఎమ్మెల్యేలు దేశం తరపున గెలిచారు కాబట్టి ఆ పదవులకు రాజీనామాలు చేయాల్సి వుంటుంది. వాటికి రాజీనామాలు చేశాక వైసిపిలో చేర్చుకుంటారు. ఆ తర్వాత ఉపఎన్నికలలో వారికే సీట్లు ఇచ్చి గెలిపించుకుంటారు. ఓపక్క రాజకీయ విలువలను కాపాడుకుంటూనే తెలుగుదేశంను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టాడు జగన్. తొలుత టిడిపి నుండి వచ్చే ఎమ్మెల్యేలు రాజీనామాలు చేస్తే, వారికి ఎమ్మెల్సీలు ఇచ్చి, వారి స్థానాలలో మొన్న ఎన్నికల్లో వైసిపి తరపున ఓడిపోయిన అభ్యర్థులనే తిరిగి నిలబెట్టి గెలిపించాలని జగన్ ఆలోచన చేశాడు. అయితే, సిటింగ్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలను వదులుకునేందుకు ఆసక్తి చూపకపోవడంతో దీనిని కొంత సవరించారు. నిన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకే ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులిచ్చి టిడిపి నుండి వచ్చిన వాళ్లకు మళ్ళీ అవే సీట్లు ఇచ్చి గెలిపించుకునే దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి.

మొత్తానికి పార్టీ దూకుళ్లకు చంద్రబాబు వేసిన దారిలోనే తెలుగు తమ్ముళ్ల తమ రాజకీయ భవిష్యత్‌ను వెతుక్కుంటున్నారు. కాకపోతే కొంచెం తేడా... కొంతమేరకు విలువలకు కట్టుబడే మార్గాన్ని అనుసరించబోతున్నారు.

## అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న పూర్ణప్రకాష్

ఆంధ్రప్రదేశ్ దళిత విద్యార్థిసేన ఆధ్వ ర్యంలో ఈనెల 26న నెల్లూరు వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా దళితసేన రాష్ట్ర కార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. నేటి యువత, విద్యార్థినీ, విద్యార్థులు, మహి ళలు అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. లింగాల రవికుమార్, దాసరి శ్రీనివాసులు, మోటుపల్లి వేణుమాధవ్, వీరమని సుధాకర్, శ్రీనివాసులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ సైన్స్ ప్రదర్శనకు..

## పల్లిపాడు విద్యార్థుల నమూనా

ఈనెల 24, 25 తేదీల్లో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్-2019లో ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్ట్ నమూనాను ప్రదర్శించగా, జాతీయస్థాయికి ఎంపికైంది. సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసులు మార్గదర్శకంలో 10వ తరగతి విద్యార్థులు పి.శ్రీలేఖ, శీనయ్య, చంద్రమ్మ, సిహెచ్ భరత్‌కుమార్, వెంకటేశ్వర్లు, కామాక్షి ఈ ప్రాజెక్టును ప్రదర్శించారు.

## కాలధర్మం

### పేర్నాటి విజయభాస్కర్‌రెడ్డి



గూడూరు నెల్‌క్యాస్ట్ కంపెనీలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పేర్నాటి విజయభాస్కర్‌రెడ్డి(61) 24వ తేదీ ఆదివారం స్వర్గస్తులైనారు. ఆయన సొంత ఊరు ముత్తుకూరు మండలం, రామాపురం గ్రామం. ఆయనకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఆయన నెల్‌క్యాస్ట్ సంస్థ స్థాపించినప్పటి నుండి ఆ సంస్థలో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి, ఎదుగుదలకి ఎంతో కృషి చేశారు. విజయభాస్కర్‌రెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### మచ్చాల ప్రసాద్‌రెడ్డి




నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం అధినేత స్వర్గీయ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి బావమరిది మచ్చాల ప్రసాద్ రెడ్డి(52) ఈ నెల 24వ తేదీన అనారోగ్యంతో కను మూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. ఆయన చాలాకాలం నిర్మాణ రంగంలో ఉంటూ నాణ్యమైన నిర్మాణాలను అందించే వ్యాపారవేత్తగా, స్నేహశీలిగా మంచి పేరు పొందాడు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని పార్లమెంటు ప్రాంగణంలో లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా చేత ఎర్రచందనం మొక్కలు నాటిస్తున్న ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు సభ్యులు. వీరిలో నెల్లూరుజిల్లాకు చెందిన ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్‌లు కూడా ఉన్నారు.

# సక్సెస్ చిరునామాగా 'షార్'

**• పిఎస్ఎల్‌వి-సి47 విజయవంతం • ఒక రాకెట్.. 14 శాటిలైట్స్**





చంద్రయాన్-2 మిగిల్చిన కొద్ది పాటి చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, అంతరిక్ష ప్రయోగాలలో భవిష్యత్‌పై కొత్త ఆశలు నింపుతూ ఈ నెల 27వ తేదీన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రయోగించిన పిఎస్ ఎల్‌వి-సి47 ప్రయోగం విజయవంత మైంది. 27వ తేదీ ఉదయం 9.28 గంటలకు నెల్లూరుజిల్లా శ్రీహరికోట లోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి నేలను విడిచి నిప్పులు విరజిమ్ముతూ నింగికి దూసుకుపో యింది. మొత్తం 26.50నిముషాల వ్యవధిలో 14 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ రాకెట్ ద్వారా మన దేశానికి చెందిన కార్టో శాట్-3తో పాటు అమెరికాకు చెందిన 13 నానో ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి పంపించారు. మూడోతరం హైరెజల్యూషన్ ఎర్త్ ఇమేజింగ్ ఉప గ్రహం కార్టోశాట్-3. 1625కిలోల బరువుగల ఈ ఉపగ్రహం ఐదేళ్లు తన సేవలను అందించనుంది. ఉగ్రవాద శిబిరాలను గుర్తించ డంతో పాటు పట్టణాభివృద్ధి ప్రణాళిక, గ్రామీణ వనరులకు సంబంధించిన సేవలు ఈ ఉపగ్రహం నుండి లభిస్తాయి.

చంద్రయాన్-2 తర్వాత ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం కావడంతో దీనికి కొంత ప్రత్యేకత ఏర్ప డింది. ప్రయోగానికి ముందురోజే రాకెట్ నమూనాకు సాంప్రదాయబద్ధంగా సూళ్లూరుపేట చెంగాళమ్మ అమ్మవారి సన్నిధిలో ఇస్రో ఛైర్మెన్ శివన్ పూజలు చేయించారు. ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్త లను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యానాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, ఏపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్య మంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అభినందించారు.

## పిఎస్ఎల్‌వి... నమ్మకాన్ని నిలబెట్టింది

ప్రయోగం విజయవంతం అయిన అనంతరం ఇస్రో ఛైర్మెన్ శివన్ షార్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుండి మాట్లాడుతూ పిఎస్ఎల్‌వి-సి47 అతి సునాయాసంగా 14 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్య లోకి పంపి ఇస్రో తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుందన్నారు. ఈ ప్రయోగం ద్వారా 300 విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చిన ఘనత ఇస్రో సొంతమైందన్నారు. 2020 మార్చిలోగా మరో 6 రాకెట్ ప్రయోగాల ద్వారా 7 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనున్నట్లు చెప్పారు.

# బాండ్ల మదుపరుల రక్షణ చర్యలేవి?

**- లోక్‌సభలో ఆదాల ప్రశ్న**



ఈ నెల 27వ తేదీన ఢిల్లీలో ఉపరాష్ట్రపతి భవన్‌లో పండిట్ రవిశంకర్ గురూజీని కలిసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి

బాండ్లను కొనుగోలు చేసే మదుపరులకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రక్షణ కల్పిస్తుందని నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చాడు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి అనురాగ్‌సింగ్ ఠాగూర్ సమాధానమిస్తూ ప్రభుత్వ బాండ్లను, ఆర్‌బిఐ కార్పొరేట్ బాండ్లను సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబి) నియంత్రిస్తుందని, ఈమేరకు పలు చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పాడు. అలాగే ఆదాల వేసిన మరోప్రశ్నకు కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి హరిప్రహ్లాద్‌సింగ్ పటేల్ వ్రాతపూర్వక సమాధానమిస్తూ ముంబై నగరం మన చిత్ర సృజనాత్మక కేంద్రంగా విలసిల్లుతోందని, అందుకే ఈ ఏడాది ఈ నగరాన్ని ఫిల్మ్ క్రియేటివ్ సిటీగా యునెస్కో గుర్తించిందని తెలిపాడు. మంచి ఆహారానికి పెట్టింది పేరైన హైదరాబాద్‌ను క్రియేట్‌సిటీ ఆఫ్ గ్యాస్ట్రోనమీగా ఎంపిక చేసిందని ఆయన పేర్కొన్నాడు.


సువర్ణాక్షర చరితమీది
మంచినిపెంచే మార్గంమీది
అమృతం నిండిన మనసుమీది
ధన్యమైన జన్మమీది

శ్రద్ధాంజలి



కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు
24వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...




కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

తేది: 1-12-2019, ఆదివారం ఉదయం 11 గంటలకు
నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీరాఘవ కళ్యాణ మండపము నందు
అన్నదాన కార్యక్రమము జరుగును.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com